ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

అక్టోబర్ 1, 2006

కొత్త సంగీత లోకం...

ఎఫ్ ఎమ్

హ్యాపీ బర్త్‌డే

(1.10.2006 నుంచి 7.10.2006 వరకు)

ఆర్. సౌమిత్రి
అక్టోబర్-2
రామలక్ష్మి-లక్ష్మణరావు
నర్సీపట్నం-విశాఖ

కె. రాజేష్
2సం॥, అక్టోబర్-3
సత్యవాణి-శ్రీనివాసరావు

ఆర్యాన్
అక్టోబర్-6
అస్రాభాను-అన్వర్‌బాష
కడప

టి. నాగ కావ్యశ్రీ
1సం॥, అక్టోబర్-4
రాధ-నాగేశ్వరరావు
వెంకటాయపాలెం-ఖమ్మం

బి. వెంకటసాయి శిరీష
6సం॥, అక్టోబర్-6
వరలక్ష్మి-రాజు
వానపల్లి-తూ॥గో॥

అయిషా ఖాతున్
3సం॥, అక్టోబర్-2003
షంషాద్-జాఫర్‌బేగ్
చిత్తూరు

కె. జాహ్నవి
పద్మావతి-అంజయ్య
బోయిగూడ-సికింద్రాబాద్

ఇ.వరలక్ష్మి
చిట్టెమ్మ-కురుమయ్య
చిర్కపల్లి-మ॥నగర్

బి. మోహన చైతన్య
వెంకటరమణ-శ్రీనివాసరావు
ఉండవల్లి-గుంటూరు

వెంకటసాయి
2సం॥, అక్టోబర్-4
ధనలక్ష్మి-సుదర్శన్
నిజామాబాద్

అప్పుడే దేశం మారుతుంది

రోజులు మారటం మామూలే. దానికి తగ్గట్టుగా మనుషులు మారాలి. కానీ విలువలు మారకూడదు. ఇవాళ్టి ప్రపంచంలో ఆత్మహత్యలు, విడాకులు, బైపాస్ సర్జరీలు పెరగడానికి కారణం విలువలు పడిపోవడమే. ఈ పరిస్థితి మారాలంటే మళ్లీ ఉమ్మడి కుటుంబాలు రాకపోయినా, యువత మాత్రం పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఆరు 'సి'లను అదుపులో ఉంచాలి. అవి సెల్‌ఫోను, సినిమా, క్రికెట్, కేబుల్ టీవీ, చాటింగ్, కాస్ట్ లేదా కమ్యూనిటీ ఫీలింగ్స్. అప్పుడే మనదేశం మళ్లీ అద్భుతంగా, ఆదర్శంగా మారుతుంది.

బి.వి.పట్టాభిరామ్

మన అతిథి గురించి...

పేరు	:	బి.వి. పట్టాభిరామ్
జననం	:	12.2.1950, నెల్లూరు
కుటుంబం	:	భార్య, కుమారుడు
విద్య	:	ఎం.ఎ. పిహెచ్‌డి
వృత్తి	:	కౌన్సిలింగ్
ఆదర్శం	:	మా నాన్నగారు
నచ్చిన పుస్తకం	:	భగవద్గీత, బైబిల్, ఖురాన్
నచ్చిన వ్యక్తులు	:	సమాజం గురించి ఆలోచించే వారందరూ
నచ్చని అంశం	:	హిపోక్రసీ
లక్ష్యం	:	తిరిగి సహాయం చేయలేనివారికి సహాయం చేయడం
బలం	:	ఆత్మవిశ్వాసం
హాబీలు	:	ఇంద్రజాలం, హిప్నాటిజం.

ఈ సంచికలో...

టపా ... 2
సెన్సూ కామన్ సెన్సు ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
విశిష్టవ్యక్తి ... 20

ఇంకా...



ఇలా వుందామా... 7
బరువా?!



కథ 18
ప్రగతి పథం

సీరియల్ 8
తెలుగుగడ్డ



ఆరోగ్యం ... 17
మనసా... తెలుసా ... 22
విజ్ఞాన వీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24



చదివే ఆసక్తి

సెప్టెంబర్ 17, 2006 స్నేహ సంచికలో 'చదివే ఆసక్తి తగ్గిందా' అంటూ అందించిన అట్టమీది కథ ఆసక్తిగా చదివించింది. ఒక మంచి పుస్తకం సంచలనాన్ని సృష్టిస్తుంది. విప్లవాన్ని రగిలిస్తుంది. చాలామంది విద్యావంతులు నెట్‌బ్రౌజింగ్‌పై ఆధారపడుతున్నారు. తమకు పుస్తకం చదివే అవసరమే లేదని భావిస్తున్నారు. ఇది చాలా బాధాకరం.

సి. ప్రమీల, పశ్చిమ గోదావరి



అద్దం పట్టింది...

ఇంటి సంగతుల్లో ఇది చాలా స్వీటు గురూ చాలా బాగుంది. నేడు ఎఫ్ఎమ్ రేడియోల్లో జాకీల వ్యాఖ్యానాన్ని వ్యంగ్యంగా చెప్పిన తీరు సహజత్వానికి అద్దం పట్టింది.

బీ. మహేష్‌రెడ్డి, ఎల్‌బీనగర్, హైదరాబాద్

విజ్ఞాన వీచిక

స్నేహ సంచికకు 'హైలైట్' విజ్ఞాన వీచిక. పాఠకుల సైంటిఫిక్ జ్ఞానాన్ని పెంచి పోషించే రచయిత ఎస్ వెంకట్రావుగారికి అభినందనలు. వారికి మేం ఎంతో రుణపడిఉన్నాం. వారు అలాగే రచనలు సాగించాలని కోరుకుంటున్నాం.

పి. ప్రభాకరరావు, హైదరాబాద్.

సినిమా కబుర్లు

'సినిమాకబుర్లు'లో 'వడియాలతో సినిమారంగంలోకి...' అంటూ శ్రీమతి జమున చెప్పిన కబుర్లు మాకెంతో నచ్చాయి. సెంటర్‌స్ప్రెడ్ చాలా బాగుంది. కార్టూన్లు నవ్వించాయి. రుచిలోని వంటలు బాగున్నాయి.

ఎస్. చైతన్య, విజయవాడ

ఇంటి సంగతులు

ఇది వరకు టీవీ ఛానల్స్ బారి నుంచి పిల్లలను తప్పించేవాళ్లం. వాళ్లని సమాధానపరిచేసరికే తలప్రాణం తోకకొచ్చేది. ఇప్పుడు ఎఫ్ఎమ్ రావడంతో పిల్లలు టీవీపై ఆసక్తి తగ్గించేశారు. రేడియో వినడం అధికం చేశారు. కారణమడిగితే చదువుతూనే వినొచ్చు, సమయం వృథా కాదుగా అన్నది వారి సమాధానం. ఇదెంతవరకు సమంజసం?! ఎవరైనా రెండు పనులను ఒకే సమయంలో సరిగ్గా చేయగలరా? ఇటువంటి విషయాలెన్నో 'ఇదిచాలా స్వీటుగురూ!' అంటూ ఇంటిసంగతులలో వివరించారు.

శరత్, తార్నాక, హైద్రాబాద్

అతిథి

'మన అతిథి' శీర్షికలో ఎందరినో పరిచయం చేస్తున్నారు. ఈ వారం అతిథి జయసింహాగారు చెప్పిన విషయాలు నిజమనిపించాయి. విదేశీ సంస్కృతిపై మోజు చూపుతున్నవారు ఈ రోజుల్లో చాలామంది ఉన్నారు. మనుషుల్లో ఇదివరకు ఉన్నటువంటి ఆదరణ, గౌరవం కరువయ్యాయి. ఇలాంటి విషమ పరిస్థితులలో యువత మానవతా విలువలతో ముందుకు సాగడం అవసరం.

వి. నాగేశ్వర్రావు, కర్నూలు

మనసాక్షి

'తెలుగు గడ్డ' సీరియల్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. జోక్స్, కార్టూన్స్ చాలా బాగున్నాయి. 'ఇలా ఉందామా' శీర్షికలో చెప్పిన సంఘటనలు హృదయాన్ని కలచివేశాయి. మనస్సాక్షినే ప్రశ్నించుకునే వారుంటే ఇలాంటి సంఘటనలు ఎక్కడా చోటుచేసుకోవు. 'ఇంటిసంగతులు'లో 'ఇది చాలా స్వీటు గురూ' ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా వుంది.

రవికుమార్, తిరుపతి

రుచి

'విజ్ఞానవీచిక'ద్వారా ప్రతి వారమూ చాలా ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటున్నాం. 'రుచి'లోని వంటకాలు బాగున్నాయి. 'కలంస్నేహం' ద్వారా చిన్నారుల్లో ఉత్తరాలు రాయడం అనే అభిరుచిని ప్రోత్సహిస్తున్నందుకు ధన్యవాదాలు.

శ్రీజ, విజయవాడ

ఓ మంచి పుస్తకం

'ఓ మంచి పుస్తకం' శీర్షికలో 'మృత్యోర్మా అమృతంగమయ' పుస్తకంద్వారా హేమలతా లవణంగారిని పరిచయం చేశారు. జోగినీ వ్యవస్థను రూపుమాపడానికి ఆవిడ చేసిన కృషి ప్రశంసనీయం. నేరస్తులలో మార్పు తీసుకురావాలని వారు చాలా శ్రమించారు. 'ఈ వారం అతిథి' శీర్షికలో చక్కని అతిథిని పరిచయం చేశారు. ఆయన మాటలు అందరికీ ఆచరణయోగ్యమైనవి.

సిహెచ్. కమల, తాడిపత్రి

కథ

ఈ వారం కథ 'క్షవరం' మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబించింది. కార్టూన్లు బాగున్నాయి. అట్టమీది కథ 'చదివే ఆసక్తి తగ్గిందా'లో ఆసక్తి తగ్గడానికి గల కారణాలను చక్కగా వివరించారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివే అలవాటు క్రమంగా పెంచుకోవడానికి ప్రయత్నించాలి.

రమేష్, తాడేపల్లి గూడెం

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ. 150/-కే ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్కసీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3840

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

సెన్సు కామన్ సెన్సు

రుక్మిణి

మొహమాట పర్వం

నేను క్యాంటీన్లో కూర్చుని కాఫీ తాగుతున్నాను. నా కొలీగ్ సన్యాసిరావు దిగాలుగా వచ్చి నా పక్కనే కూర్చున్నాడు. ముక్కుతూ, మూలుగుతూ, గుటకలు మింగుతూ కాఫీ తాగాడు. మనిషి బాగా పాలిపోయి ఉన్నాడు. కళ్లు ఎర్రబారాయి. మొత్తానికి గురుడు ఏదో సమస్యల వలయంలో చిక్కుకున్నాడు.

వాడు లేచి బయటికి నడుస్తూ 'రా...' అంటూ నాకు సైగచేశాడు. నేను వాణ్ణి అనుసరించాను. ఓ మూలన ఉన్న చెట్టుకిందికి పోయిం తర్వాత వాడు తన వేదన వెళ్లగక్కాడు.

"ఒరే 'అమ్మకు వంట్లో బాగాలేదు. అర్జంటుగా ఆపరేషను చేయాలి. హాస్పిటల్ తప్పదురా. నువ్వేదిక్కు' అంటూ మన డిస్పాచ్ సెక్షను గురుమూర్తి నా పీకలమీద కూర్చున్నాడు. నాకు ఊపిరాడదాయే. పాతిక వేలిచ్చాన్రా... వారం తర్వాత పూవుల్లో కాకున్నా లేత ఆకుల్లో చుట్టిస్తానన్నాడు. పిఎఫ్ లోను వస్తుందన్నాడు. కన్నీరు కార్చాడు. చేతులు పట్టుకున్నాడు. బ్యాంకులో మా ఆవిడ తాలూకు డబ్బు కొద్దిగా దాచా. అది తీసిచ్చి ఇప్పటికి ఆరునెల్లయింది. ఈ విషయం మా ఆవిడకు తెలీదు. డబ్బు విషయం అడగబోతే మొహం చాటేసేవాడు. ఇప్పుడు ధైర్యంగా మొహం చిట్లిస్తున్నాడ్రా"

"రేపు నీ మొహం మీదనే 'ఛోరా' అంటాడు" అంటించాను నేను.

వాడు బేలగా బావురుమనబోయి తమాయించుకున్నాడు. "ఇంతకీ ఏదైనా కాగితం రాయించుకున్నావా?" అన్నాను. వాడు తల అడ్డదిడ్డంగా ఊపి, "అబ్బెబ్బే... వాడు నన్ను ఎంత తొందర పెట్టాడూ... వాడు కన్నీరు చిందిస్తుంటే... నాకు ఏడుపొచ్చింది. హడావుడిగా డబ్బులు 'డ్రా' చేసిచ్చా. తిరిగిరాంగానే రాస్తానన్నాడు. వారందాకా కనిపించలా... జాలిపడ్డాన్రా... గుండెకరిగిపోయింది"

"వాడు రోజూ క్లబ్బునుండి వస్తూ కనిపిస్తాడు నాకు. అక్కడ వేటాడాల్సిఉండాలి" వళ్లుమండి అన్నాను. ఎందుకంటే గురుమూర్తి తల్లి పదేళ్ల కిందటనే బకెట్టు తన్నేసింది.

"ఒరే సన్యాసీ... నీది జాలిగుండె కానే కాదు. ఇచ్చుటలో ఉన్న హాయిని అనుభవించాలని నీ ఆరాటం కావచ్చు. అది గాకపోతే నీ మొహమాటం కావచ్చు. ఎట్లాగో ముందు కాళ్లావేళ్లాపడి ఓ కాగితం గెలికించుకో..." సలహా ఇచ్చి ఆఫీసులో దూరాను.

ఇల్లు చేరానో లేదో భామ ఓ లిస్టు నా చేతిలో పెట్టింది.

"ఏంటే ఇదీ?" విస్మయంగా అడిగాను.

"కనపడ్డంలా... అర్జంటుగా కిరాణా కొట్టుకు వెళ్లి ఈ సరుకులు పట్రండి. చక్కెర, టీపొడి, కారం..." భామ చిన్న దండకం ఒకటి చదివింది. నేను కొయ్యబారిపోయాను.

"అదేంటే... రెండో తారీఖున మొత్తం నెలకు సరిపడా లిస్టు నువ్వే రాశావు. మనిద్దరం సూపర్ బజార్లో ప్యాక్ చేయించి తెచ్చాం. ఇవాళ ఇరవై.

అప్పుడే సరుకులు ఎలా అయిపోయాయని అడిగాను.

భామ అదోలా నవ్వింది. నన్ను కూర్చోబెట్టింది. ఉపదేశం చేసే గురువుగారిలా తగులుకుంది.

"మన ఎదురింటి హిడింబి పిన్నిగారింటికి అనుకోకుండా బంధువులు వచ్చేశారు. ఒకసారికాదు... నాలుగు సార్లు.. వాళ్లాయన ఊర్లో లేడుగా. అర్జంటుగా మనింటికి వస్తే బదులిచ్చా... తర్వాత తీర్చుతానంది"

"ఇది మరీ బాగుంది. వాళ్లాయన బార్షాపుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈవిడ చేబదులు అవసరాలకోసం నీచుట్టూ... అయినా నీకంత మొహమాటం ఎందుకే! రెండోసారైనా కుదరదని చెప్పొద్దూ?!" భామ మొహం ఎర్రగా కందిపోయింది. యుద్ధం తప్పకపోవచ్చు. అప్పటికి నేనే సర్దుకుని బయటపడ్డా."చూడు భామా, మొహమాటం చాలా డేంజరస్. ఈ చేబదుళ్లూ అంతే! మంచి స్నేహాన్ని చెడగొడతాయి. గుట్టుగా వున్నవాళ్లను కాస్తా బజార్న పడేస్తాయి. చెల్లికో ప్రాణస్నేహితురాలుంది. ఆవిడ ఏదో పెళ్లికి పోవాలీ అనడిగితే మా చెల్లి తన దగ్గరున్న ఓ పెద్దగొలుసు ఇచ్చింది. పెట్టుకుని ఆవిడ పోయింది. పెళ్లయి నెలగడిచింది. రెండునెలలయింది. గొలుసు తిరిగిరాదు. నిలదీసి అడిగితే వాళ్ల వాళ్లెవరికో అత్యవసరం పడితే బ్యాంకిలో తాకట్టు పెట్టారట. విడిపించి ఇస్తారని చల్లగానే చెప్పింది. మా చెల్లి లబోదిబో... మా బావ మంచివాడు కాబట్టి సహించాడు. మొన్నామధ్య వడ్డీ మందం డబ్బులు కలిపి విడిపించుకున్నారట. అది లెంపలేసుకుంది. మొహమాటం అంతపని చేస్తుంది. చేయిస్తుంది"

మా భామ కళ్ళు చికిలించి వింటోంది.

"స్నేహితులనూ, బంధువులనూ అవసరాల్లో ఆదుకోవడంలో తప్పులేదు. అయితే ఆ పని 'మొహమాటం'తో చేయకూడదు. నా మాటల్లో చెప్పాలంటే... అవసరం పడినవారికి ఆశ వదులుకుని ఇస్తే తర్వాత ఈ పశ్చాత్తాపం గోలవుండదు. బాధలేదు. అలాంటి స్థాయి మనకు లేకపోతే, వీలుపడకపోతే 'నా చేతకాదని' వినయంగా చెబితే ఏ చిక్కూ ఉండదు. కార్యనిర్వహణలో, వ్యవహారాల్లో ఈ మొహమాటం ఒక చీడపురుగులాంటిది. పూరాగా తొలిచిపారేస్తుంది"

భామ ఏదో ఆలోచిస్తోంది. అంటే మొహమాటానికి పోయి ఈ చుట్టుపక్కల పరిచయస్తులకు అప్పుడప్పుడూ డబ్బులు చేబదులుగా ఇచ్చి ఉంటుంది. ఏం చేస్తాం! ★

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు
న్యాయ సంబంధమైన
ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం
చేయాలో పాలుపోక
సతమతమవుతున్నారా? అయితే వెంటనే
ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి.
న్యాయవాది
శ్రీ జి.ఎల్.నరసింహారావు
తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.
మా చిరునామా:
ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం,
ఫ్లాట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

కేసు పెడితే ఇబ్బందులు వస్తాయా?

మా నాన్నగారు గవర్నమెంటు ఉద్యోగి. మేం నల్గురం పిల్లలం. ఒక కూతురు, ఆమెకి పెళ్ళి చేసి పంపారు. మేం నలుగురం **18-25** మధ్య వయసువాళ్ళం. ఇద్దరు తమ్ముళ్లు చదువుకుంటున్నారు. నేను ఖాళీగా ఉన్నాను. అన్నయ్య ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. అమ్మ ఇంట్లోనే ఉంటుంది.

మా నాన్నగారికి **10** సంవత్సరాల నుండి ఒకావిడతో సంబంధం ఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆవిడ దగ్గరికి వెళ్ళటం ఆపడంలేదు. ఆవిడకి ఒక అబ్బాయి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వాళ్ళ ఆయనకి, ఇంకా అందరికీ తెలుసు. అయినా ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. నాన్న గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నప్పటికీ మేం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. మాకు ఆస్తులేమీ లేవు. కనీసం సొంతిల్లు కూడా కాదు.

ఆమధ్య మా నాన్నకి, ఆవిడకి తగువొచ్చి ఒక **10** రోజులు వెళ్ళలేదు. మరలా ఆమె కబురుపెట్టి పిలిపించింది. మళ్లీ మామూలే. నాన్నని ఆవిడ బెదిరిస్తుందట. కేసు పెడతానని, నీ ఉద్యోగం తీయించేస్తానని, నిన్ను బజారుకీడుస్తానని చెబుతుందట. నాన్న భయపడి వెళుతున్నారు. మా కుటుంబం వేరు, ఆవిడ కుటుంబం వేరు. ఆమెకు భర్త ఉన్నాడు. దానివల్ల పోలీస్ స్టేషన్‌లో గాని కేసు పెడితే మాకేమైనా ఇబ్బందులు వస్తాయా? నాన్న రిటైర్ అయితే వచ్చే డబ్బుకోసం ఎదురుచూస్తోంది. మేం ఆ డబ్బుతో సొంతిల్లు కొందామని చూస్తున్నాం. మాకు వేరే ఆస్తుల్లేవు. ఆవిడ మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేస్తోంది. దీనికి పరిష్కారం చెప్పగలరు. ఈమధ్యన మా నాన్న వాళ్ళింటికెళ్ళడం తగ్గించారు. అపుడు ఒక లాయరు మా నాన్న దగ్గరికొచ్చి 'ఏమి, వాళ్ళింటికి వెళ్ళడం లేదు? వెళ్ళు.. లేకపోతే ఆవిడ కేసు పెడతానంటోంది' అని బెదిరించాడు. దయచేసి తగిన సలహా ఇవ్వగలరు.

కె.జి.పి.ఆర్



మీ నాన్నగారి అక్రమసంబంధం గురించి మీ అమ్మగారికి తెలిస్తే ఆవిడే వెళ్లి ఆ స్త్రీతో నేరుగా మాట్లాడి తేల్చుకోవాలి. ఆవిడ మాట్లాడని పక్షంలో ఆవిడ భర్తతోనే విషయం చెప్పే సాహసం చేయాలి. ఆవిడే మీ నాన్నను భయపెడుతోందా? లేదా మీ నాన్నగారే భయపెడుతున్నారో... చెప్పలేం కదా.

మీ నాన్నగారు ఆవిడ బెదిరింపులకు లొంగాల్సిన అవసరం లేదు. ఆయనే నేరుగా పోలీస్‌స్టేషన్‌కెళ్లి బ్లాక్‌మెయిల్ చేస్తోందని కేసు పెట్టవచ్చును. ఆమె అక్రమంగా ఏ కేసు పెట్టినా ఎదుర్కోవడానికి సిద్ధపడాలి. ఆవిడకు ఎంతమాత్రం భయపడవలసిన పనిలేదు. మీ నాన్నగారు ముందుగా మీ కుటుంబసభ్యులందరితో చర్చించాలి. ఇప్పటికైనా జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకుంటే మంచిది. మీకు తెలిసి కూడా ఊరుకుంటే ఈ పరిణామాలు ఎంతకైనా దారితీస్తాయి.



ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

మందభాగ్యులు

మహాలక్ష్మి రోడ్డుమీదికొచ్చి ఆటోకోసం చూడడం మొదలెట్టింది. ఎప్పుడూ ఆ సెంటర్‌లో కనీసం రెండుమూడు ఆటోలు నిలిచి ఉంటాయి. వాళ్ళు "అటురాం... ఇటురాం" అనడం వేరే విషయమైనా, అసలంటూ ఆటోలు ఉంటాయి. కాస్త ఎండవేడి అందుకుంది. మహాలక్ష్మికి ఈ ఊళ్లో ఈమధ్య ఆటో ఎక్కాలంటే చిరాకుగానూ, భయంగానూ ఉంటోంది. అవసరం అలాంటిది మరి. తప్పనిసరిగా అటూఇటూ చూస్తూ ఆమె ఆలోచిస్తోంది.

అసలు ఆటోల అవసరం ఎవరికి? కాస్త డబ్బుండి, స్తోమత గలవాళ్లు కారు కొనుక్కుని దానిలోనే తిరుగుతున్నారు. నెలసరి ఉద్యోగాలు చేసేవాళ్ళు, పరిమితమైన ఆదాయం గలవాళ్లు బస్సుల్లో వెళ్తారు. ఎప్పుడో వర్షాలు, వరదలు, గొడవలు, సమ్మెలు చోటుచేసుకున్నప్పుడు ఆపూటకు ఆటో ఎక్కుతారు. అదీ వీలైతే షేర్ ఆటోలో వెళ్లడానికి ప్రయత్నిస్తారు. అటూ ఇటూ గానీ మధ్య తరగతి మందభాగ్యులు, వంట్లో ఇంకా ఓపికుందని భ్రమపడే మధ్య వయసు దాటిన వాళ్ళు, కొత్తగా రిటైరై హుషారుగా తిరుగుదామని డబ్బులు గలగల్లాడించే వాళ్లు ఆటోలకోసం ఎగబడతారు. తను మాత్రం బస్సు ఎక్కలేక, కారులో వెళ్లే స్తోమత లేక, స్కూటరు మీద తీసుకెళ్లేవాళ్లు లేక ఇలా ఎండలో ఆటోకోసం చూస్తోంది. ఎట్టకేలకు ఒక ఆటోవచ్చింది.



మహాలక్ష్మి తన సహజలక్షణంగా ఆటో అబ్బాయిని పరిశీలనగా చూసింది. అలా చూసి ఆమె కొన్ని నిర్ణయాలు చేసుకుంటుంది. ఆటోడ్రైవరు కుర్రాడై ఉండకూడదు. ఒకవేళ ఉన్నా నమ్రతగా ఉండాలి. నమ్మకాన్ని కలిగించేలా మాట్లాడాలి. విసురు సమాధానాలు, తలఎగరేసి మాట్లాడే వ్యవహారాలు ఉండకూడదు. ఇవన్నీ తను ఒక్కచూపులో గ్రహించేయగలనని, తను నాణ్యత చూసుకుని ఎక్కిన ఆటో ఆశాభంగం కలిగించదని మహాలక్ష్మికి మహానమ్మకం.

ఈ ఆటోడ్రైవరు కుర్రాడు కాదు. నలభై పైనే ఉండొచ్చు. మరీ నల్లగా లేడు. శుభ్రంగా ఉన్నాడు. అన్నింటికీ మించి ఎర్రటి కుంకుం కనుబొమ్మల మధ్య కనిపించింది. మహాలక్ష్మికి మరింతగా నచ్చింది. భయమూ, భక్తి ఉన్నవాడన్న మాట అనుకుని "ఏం బాబూ! వస్తావా" అంది.

"అందుకే కదండీ, వచ్చి మీ ఎదుట నిలబడ్డాను" అన్నాడు.

"అబిడ్స్ పోవాలి" అంది.

"ఎక్కండి"

"మీటర్ సరిగ్గా ఉందా?" అంది.

"సరిగ్గానంటేనండి" అన్నాడు మీటరు టింగు మనిపిస్తూ.

"కరక్టుగా తిరుగుతుందా?" అంటూ అందులో ఎక్కికూర్చుంది.

ఆటో ముందుకు కదిలింది. మహాలక్ష్మి మీటరు వైపు చూసింది. పది రూపాయలు చూపిస్తోంది.

"హమ్మయ్య" అనుకుని విశ్రాంతిగా కూర్చుంది. ఏ ఆటోనైనా బయలు దేరేప్పుడు పదిరూపాయలే చూపిస్తుంది కదా! కానీ కొన్ని అలా చూపించవు. అదేంటని అడిగితే 'అదంతే, రిపేరు చేయించాలి' అని ఏదోరకంగా డబ్బులు ఎక్కువ లాగడం ఆమె అనుభవంలోని విషయం.

అయితే బయల్దేరిన కొద్దిసేపటికే మీటర్ మారడం మొదలెట్టింది. ఆమెకెప్పుడూ ఒక టర్నింగు దగ్గర మీటర్ మినిమం ఛార్జి దాటుతుంది. అదే అడిగింది.

"నా మీటరు కరక్టేనమ్మా.. అంత అనుమానమైతే ఎలాగమ్మా?" అని ఒకసారి వెనక్కి తిరిగి చూసి, రోడ్డువైపు దృష్టి మళ్ళించి వేగం పెంచాడు. ఊరికే ఉండక టేప్‌రికార్డర్ పెట్టాడు. 'బ్రహ్మామురారి' అంటూ బాలూ కంఠం మొదలెట్టేసింది. అసలే రోడ్డుమీద ట్రాఫిక్, రణగొణ ధ్వనితో మహాలక్ష్మికి చిరాకనిపించినా, భక్తి కనుక సరిపెట్టుకుందామనుకుంది. మళ్లీ మీటర్‌కేసి చూస్తే నలభైదాటింది.

"ఏంటి బాబూ, నీ మీటరు మహా జోరుగా ఉంది. ఇలా అయితే దిగి మరో ఆటో ఎక్కుతాను" అంది దబాయింపుగా.

"చాల్లేవమ్మా! ఎన్నిసార్లు చెప్పాలి, అది కరక్టుమీటరని.. మీటరు చార్జీలు పెరిగాక ఆటో ఎక్కలేదేమో" అన్నాడు. ఆమెకి గుండెల్లో బాకుతో పొడిచినంత బాధ కలిగింది. అంటే తను ఆటో ముఖమే ఎరగదన్నట్లు తేల్చాడు. వెంటనే దిగిపోదామనుకుంది. సరిగ్గా అప్పుడే ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగింది ఆటో. కొన్ని వందల వాహనాలు. అక్కడ బస్సులు కార్లు, ఆటోలు, స్కూటర్లు, సైకిళ్లు, చువ్వలు వేసుకుని రిక్షాలు ఇన్నింటి మధ్య తప్పుకుంటూ పాదచారులూ అక్కడ దిగడం అసాధ్యమనిపించి, ఆ క్రాస్‌రోడ్డు దాటంగానే దిగుదామని నిర్ణయించుకుని అస్థిమితంగా కూర్చుంది మహాలక్ష్మి. ఆటో ఒక ప్రైవేటు బస్సును ఆనుకుని నిలబడింది. మన ఆటో డ్రైవరు సరిగ్గా తన చేతికి అందుబాటులో ఉన్న ఆ బస్ సిగ్నల్ లైటు బల్బు చక్కగా ఊడదీసి లోపలికేసుకున్నాడు. ఆ బల్బు ఉన్నదానికి పైన ఉండే ప్లాస్టిక్ డోమ్ లేదు.

"ఏయ్, ఏమిటీ నువ్వు చేస్తున్నపనీ?" ఆమె గట్టిగా అరిచింది.

"ఏంటల్లా అరుస్తారు? ఆ బల్బు కిందపడిపోతుంటే తీశానమ్మా" అంటూ అబద్ధ మాడాడు. "కాదు నువ్వు కావాలనే తీశావు" అంటూ మళ్లీ గొంతు చించుకుంది. ఇంతలో ట్రాఫిక్ కదిలింది. "ఇంక చాలు ఆపు. ఏభై రూపాయలా?" అంది.

"మరీ ఊరికే రాదమ్మా ఆటో" అన్నాడు.

"నువ్వేంటలా దొంగతనంగా బల్బు" ఆమె మాట పూర్తి అయ్యేంతలో...

''తియ్యవమ్మా డబ్బులు'' అంటూ అసహ్యంగా ముఖం పెట్టాడు.

ముప్పై రూపాయలిచ్చింది మహాలక్ష్మి. నిజానికి పాతికమించి అవదు. ఇద్దరూ కాసేపు ఘర్షణ పడ్డారు. ఆమె ఒప్పుకోలేదు.

"పెట్రోలు పెరిగిందేమని అడగరు. పోలీసులు అన్యాయంగా డబ్బులు గుంజితే మాట్లాడరు. ఆటో నాలుగు డబ్బులు చేసుకుంటే న్యాయం గురించి ఓ లెక్చర్లు దంచుతారు" అంటూ సణుక్కుంటూ తిట్టుకుంటూ వెళ్లిపోయాడు.

న్యాయం, నిజాయితీల గురించి ఆలోచించడం ఎక్కడ్నించి మొదలుపెట్టాలి? "ప్రతిమనిషీ మరొకరిని దోచుకునే వాడే" అన్న మహాకవి మాటలు గుర్తుకొస్తున్నాయి. మోసగించిన వాడెలా ఫీలవుతాడోగానీ మోసానికి గురైనవాడి మనసు అనహాయంతతో కుతకుతలాడిపోతుంది. ఇలాంటి మహాలక్ష్ములెందరో ఈ క్రమంలో భంగపడక తప్పదనిపిస్తుంది. ★

ఇలా వృందామా...

వి. నాగరత్న



బరువా?!

(అక్టోబర్ 1
వృద్ధుల దినోత్సవం సందర్భంగా)

బాలలకు, వృద్ధులకు చాలా పోలికలుంటాయి. పిల్లలకు ఇంకా పళ్ళు రావు. వీళ్ళకేమో వచ్చిన పళ్ళు ఊడిపోయి బోసినోళ్ళతో చప్పరిస్తూంటారు. పిల్లల్లాగే అందర్నీ పోల్చుకోలేరు. త్వరగా మర్చిపోతారు. చిన్నారుల్లాగే తమ పనులు తాము చేసుకోలేక వేరొకరిమీద ఆధారపడ్తారు. త్వరగా అలిసిపోతారు. ఎవరైనా కాస్త చేసిపెడితే తిని పడుకుందామనుకుంటారు. అయితే పిల్లలకీ, పెద్దలకీ ఒక ప్రధానమైన తేడా వుంది. పిల్లలు అల్లరిచేసినా, ఆగడంచేసినా ఓపిగ్గా భరించి ప్రేమగా, లాలనగా చూసుకుంటారు. అదే వృద్ధులైతే 'ఇదెక్కడి తద్దినం' అన్నట్లు ఆమడదూరానికి పారిపోతారు.

అందుకు నిదర్శనం రమణ కుటుంబం.

❊❊❊

రమణ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఓ పెద్ద మల్టీనేషనల్ కంపెనీలో చేస్తున్నాడు. వాళ్ళ అనుబంధసంస్థ అమెరికాలో వుండటంతో అక్కడికి పంపుతామని ఆఫరిచ్చారు. రమణ తబ్బిబ్బయిపోతూ ఆ సంగతి ఇంట్లో చెప్పాడు. భార్య సంబరపడిపోయింది. కానీ రమణ తల్లిదండ్రుల ముఖాలు వాడిపోయాయి.

"ఏంటి నాన్నా, నాకింత మంచి అవకాశం వచ్చినందుకు కాస్తయినా సంతోషంగా లేదా? ఏమ్మా, నువ్వు?" అన్నాడు రమణ.

"ఇక్కడ నీకేం తక్కువైందని? నలభైవేలిస్తున్నారు కదరా?" అన్నాడు రామారావు.

"కానీ అక్కడికెళ్తే ఇంతకు రెట్టింపు వస్తుంది"

"అయితే వెళ్దామనే నిర్ణయించుకున్నావా?"

"ఇంత మంచి ఆఫరొస్తే వెళ్ళకుండా ఎలా వుంటాను?"

"కానీ నువ్వు లేకుండా మేం వుండలేంరా. ఒంటరితనం..."

"సిల్లీగా మాట్లాడకు నాన్నా, టెక్నాలజీ పెరిగి దూరాలు తరిగిపోయాయి. మేం వెళ్తే మాత్రమేం, ఫోన్లు చేస్తాం, వీలైనప్పుడు వస్తుంటాం"

రామారావు ఇంకేం రెట్టించలేదు.

సీతమ్మ నిగ్రహించుకోలేక "అంటే పూర్తిగా వెళ్ళిపోతావా?" అనడిగింది.

"అవునమ్మా, ఇదేదో ప్రాజెక్ట్ వర్క్ కాదు, ఉద్యోగం. కనుక ఫామిలీతో వెళ్తాను"

ఆ మాటతో ఆవిడలో పూర్తి నిస్సత్తువ చోటుచేసుకుంది.

కంపెనీవాళ్ళే పంపడం కనుక వీసా అదీ త్వరగానే వచ్చింది. రెండు నెలల్లో భార్య, ఇద్దరు పిల్లలతో రమణ అమెరికా ప్రయాణమై వెళ్ళిపోయాడు. ముసలి తల్లీతండ్రీ మాత్రం ఒంటరిగా మిగిలిపోయారు.

❊❊❊

ఆవేళ రామారావు స్నేహితుడు సింహాచలం వచ్చాడు.

మాటలమధ్యలో "నీకసలే ఒక్కగానొక్క కొడుకు, అమెరికా ఎందుకు వెళ్ళనిచ్చావురా?" అన్నాడు.

"ఇది మరీ బాగుంది, నేనొద్దంటే ఆగిపోతారా?"

"అదేంటిరా, పిల్లలు విదేశాల్లో స్థిరపడితే తల్లిదండ్రులు ఒంటరితనంతో మగ్గిపోతారని ఇతర్లగురించి బాధపడేవాడివి. రమణతో ఎందుకు మాట్లాడలేదు? ఆఫ్టరాల్, వాడు నీ కొడుకు"

"పిచ్చివాడా, కన్నంతలో మన ఆలోచనలను గౌరవిస్తారని ఆశిస్తే ఎలా?"

"అదికాదురా.."

"ఏది కాదు? నాకు తనొక్కడే కొడుకని తెలీదా? ఆ మాటకొస్తే ఎందరుపిల్లలున్నా వాళ్ళు లేని లోటును ఇంకో కొడుకు లేదా కూతురు తీర్చలేరనుకో.. అది వేరే సంగతి. పెద్ద వయసులో పిల్లల ఆసరా లేకపోతే ఎంత కష్టమో చాలా సందర్భాల్లో వాడితో ప్రస్తావించాను. అయినా వెళ్ళాడంటే నా మాటలంటే లక్ష్యంగానీ మాపట్ల ప్రేమగానీ లేనట్లేగా"

"కానీ, వద్దని చెప్తే ఆగేవాడేమో"

"అంత మంచి జీతాన్ని ఎలా కాదనుకోగలను అన్నాడేగానీ మాగురించి క్షణం ఆలోచించలేదు. నేనైతే అంతకంటే వాదించడానికి మనస్కరించక ఊరుకున్నాను గానీ వాళ్ళమ్మ ఎంతగానో బ్రతిమాలింది. నోరుతెరిచి 'పోనీ మమ్మల్నీ నీతో తీసుకెళ్ళ'మని అడిగింది. 'మీరక్కడ ఇమడలేరు' అంటూ తప్పించుకున్నాడు. నిజంగా తల తీసినట్లయిందంటే నమ్ము..." అన్నాడు రామారావు.

రెండు క్షణాలాగి "రమణ చిన్నకొడుక్కు ఆస్త్మా వుంది. ఆ చల్లటిదేశంలో వాడితో చాలా కష్టమే. అయినా పిల్లల్ని వదిలేసి వెళ్ళలేదే, మమ్మల్నంటే నిర్దయగా వదిలేయగలిగాడు" అన్నాడు తిరిగి.

"ఏంటో చాలామంది పిల్లలు ఇలాగే వున్నార్రా. కొందరు తమ దారి చూసుకుని వేరే ఊళ్ళకు లేదా విదేశాలకు వెళ్ళిపోతున్నారు. ఇంకొందరేమో ఓల్డేజ్ హోములకు గెంటేస్తున్నారు. తమ దగ్గరుంచుకున్నవాళ్ళు కూడా నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారు. ఇలాంటివేమీ లేకుండా ఆప్యాయంగా చూసుకుంటున్నవాళ్ళు నిజంగా కొద్దిమందే" అన్నాడు సింహాచలం.

"మనం ఎన్ని త్యాగాలు చేసి, ఎంత ప్రేమగా పెంచితే వాళ్ళీ దశకొస్తారు?! కానీ మనగురించి వాళ్ళకేం పట్టదా?" ఆవేదనగా అన్నాడు రామారావు.

"పిల్లలైతే బాధ్యత, ముసలోళ్ళు బరువురా బాబూ" అని పేలవంగా నవ్వాడు సింహాచలం. ★

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

చోటామియా అఖిలాండం గడ్డం పట్టుకోగా ఆమె అతని చెంపపై కొట్టడంతో అవమానానికి గురయ్యాడతను. తర్వాత కోదండరాంరెడ్డిని వెంటతీసికెళ్ళారు. మిలట్రీ వెంటవెళ్తున్న భర్తను ఏం చేస్తారో పాపిష్టివాళ్ళని బాధపడసాగింది రంగనాయకమ్మ.

(37వ భాగం)

తెల్లవారింది.

సిపాయిలు గ్రామ ముట్టడిని వదిలేసి అప్పటికి దొరికిన వారందరినీ తాళ్లతో కట్టి లంకెలు పెట్టిపటేలు ఇంటికి తీసుకొచ్చారు. అప్పటివరకు అటకలు ఎక్కి దాక్కున్నవారంతా నెమ్మదిగా ఎవళ్ల దొవన వాళ్లు జొన్న చేల వైపుకు పరుగులు పెట్టారు.

చూస్తుండగానే గ్రామమంతా నిర్మానుష్యంగా తయారైంది. రజాకార్ల గుంపు 220 ఇళ్లమీదపడి దొరికినదల్లా ఎత్తుకొచ్చి పటేలు సందున గుట్టలు పడేస్తున్నారు.

పటేలు కాఫీ ఫలహారాలు చేయించే పనిలో లోపలికి, వెలుపలికి పరుగులు పెడుతున్నాడు. బారెడు పొద్దెక్కింది.

కాఫీ ఫలహారం ముగించుకుని మిలట్రీ ఆఫీసరు అప్పుడే బయటికొచ్చాడు. ఒకరికొకరికి లంకెలు కట్టబడిఉన్న గ్రామ ప్రజలందరినీ చూసి జాలిపడ్డాడు. "వీళ్లందరూ ఎందుక్కా కట్టివేసినరు?" అన్నాడు.

ఆయన మాటలకు మిలట్రీ హవల్దారు గానీ, బడేమియాగానీ ఎవరూ మాట్లాడలేదు. తిరిగి ఆఫీసరు సిపాయిల వైపుకు చూసి "అందర్నీ వదిలేయండి" అన్నాడు.

ఆయనలా ఆజ్ఞాపించడమే తరువాయిగా అందరి చేతులకూ కట్టిన తాళ్లను విప్పివేశారు. ప్రజలందరూ చేతులెత్తి ఆఫీసరుకు దండాలు పెట్టారు.

ఆఫీసరు నవ్వుతూ అందరివైపుకూ చూశాడు. "హేమయా, మీరందర్ సంగం వాళ్లకు సాయం చేస్తుండరని విన్నాం. అది చెయ్యడం సర్కార్లకు ద్రోహం చేసినట్లు అవుతది. సర్కారు మీకు పెద్ద రోడ్ల



వేయించింది. చాలా చాలా మంచిపనులే చేసినది. ఇంకా మీరు ఏదైనా కోర్కుంటే దాన్కి కూడా మంజూరి చేయిస్తది. మీ పనుల్ మీరు చేస్కుని బతకటం మంచిది. మీకా షంగాల్ గింగాల్ వద్దు. సంగం వాళ్లు ఒట్టి బద్మాషుల్ ఉండారు. వాళ్ల మాటల్ ఎంతమాత్రం నమ్మకం చేయ్యండి. లోగడా సంగం చేసిన వాళ్లు వచ్చి శెమార్పణ కోర్కుంటే సెమిస్తాం. మీరు మేం భాయి భాయి ఉండాలి, మనం అందరం కల్సి సర్కారు జిందాబాద్ అని కోర్కుందాం" అని ఆఫీసరు చెప్పుకుపోతున్నాడు.

ప్రజలందరూ తలలూగిస్తూ వింటున్నారు. తిరిగి ఆఫీసరు చెప్పడం ప్రారంభించాడు. "సంగం వాళ్లను గ్రామంలోకి రానీయకండి. వాళ్లు వస్తే మాకీ కబురు చేయండి. మేం వస్తాం. వాళ్లని పట్కాపోతాం, ఖైదుచేస్తాం. తగిన మాదిరి శిక్షల్ వేస్తాం. కానీ మా సిపాయిల్ రావడం చూసి కొంపాగోడుల్ వదిలిపెట్టి పారిపోవడం వద్దు. మా సిపాయిల్ మీకు ఎట్వంటి హాని జేయరు తెల్సిందా?" అన్నాడు.

ప్రజలంతా తలూపారు. తర్వాత ఆఫీసరు జీపు వద్దకు నడిచాడు. మిలట్రీ అంతా లారీల్లోకి ఎక్కుతోంది. పటేలు, బడేమియా ఇద్దరూ ఆఫీసరు వద్దకొచ్చారు. వారిద్దరినీ చూసి జీపు ఎక్కబోతున్న ఆఫీసరు ఆగిపోయాడు.

"క్యా బడేమియా సాబ్?" అన్నాడు.

బడేమియా వినయంగా నవ్వాడు. "ఇక్కడ మిలట్రీ కేంద్రం పెట్టమని పటేలు అడుగుతున్నాడు సాబ్" అని చెప్పాడు.

ఆఫీసరు పటేలు వైపుకు చూసి "హేమయా పటేలు, ఇక్కడ సిపాయిల్ ఎందుకు?" అన్నాడు.

పటేలు వినయంగా చేతులు కట్టుకుని ముందుకొచ్చాడు. "ఇక్కడ పొలం పుట్రా బోలెడుంది. కోతలు జరిపించి కైళ్లు చేయించుకోవాలి. సంగం వాళ్లు వచ్చి పడ్తారని భయంగా ఉంది సాబ్" అన్నాడు.

ఆఫీసరు కాసేపు ఆలోచనలో పడ్డాడు. చివరికి ఒక హవల్దారును ఇరవైమంది సిపాయిలను అక్కడ ఉండే ఏర్పాటు చేశాడు. మిగతా మిలట్రీనంతా తీసుకుని వెళ్లిపోయాడు.

లారీలు వెళ్లిపోగానే గ్రామ ప్రజలందరూ ఇళ్లకు బయల్దేరారు. అది చూసి పటేలు బడేమియాకు సంజ్ఞ చేశాడు. బడేమియా హవల్దారుకు చెప్పాడు. హవల్దారు సిపాయిల వైపుకు చూస్తూ "వారందరినీ వెనక్కు తీసుకురండ"ని అజ్ఞాపించాడు. వెంటనే నలుగురు సిపాయిలు పరిగెత్తుకుని వెళ్లారు. వెళ్లిపోతున్న జనాభానంతటినీ వెనక్కి తిప్పుకొచ్చారు. వారందరినీ ఆవులదొడ్లోకి తోలి పెండెం బిగించారు.

తర్వాత హవల్దారు, పటేలు, బడేమియాతో ఇంకా కొందరు ఇంటిముందు వరండాలో కూర్చుని ఇష్టాగోష్టి ప్రారంభించారు. ఎదురుగానున్న ఎడ్లకొట్టంలో వేటపోతును వేలాడదీసి తిత్తి వలుస్తున్నారు. అప్పటికి భోజనాలవేళ దాటింది. ఎండ తీక్షణంగా కాస్తోంది. దొడ్లో వుంచిన గ్రామ ప్రజలందరూ చిందులు తొక్కుతున్నారు. కింద పాదాలు, పైన తల వేడెత్తిపోతోంటే సహించలేకపోయారు. అందరిలోకి ముందుగా బ్రహ్మారెడ్డి కళిగించుకున్నాడు.

"ఏమండీ దొర చెప్పిపోయాడు గదా,

మమ్మల్ని వదలరేమిటీ?" అనడిగాడు.

హావల్దారు మాటల్లోపడి అది వినిపించుకోనేలేదు. తిరిగి బ్రహ్మారెడ్డి స్వరం హెచ్చించి మాట్లాడాడు. "ఇదిగో ఏమండీ, మేమూ మనుషులమే. గొడ్లను దొడ్లో తోలినట్లు తోలి పెండెం బిగవేసి కూర్చున్నారు" అన్నాడు.

అప్పటికీ హావల్దారు నుండి జవాబు రాలేదు.

"ఏమండీ మిమ్మల్నే" అంటూ అరిచాడు బ్రహ్మారెడ్డి.

ఆ అరుపుతో హావల్దారే కాకుండా అక్కడ కూర్చున్న వారంతా తలలు తిప్పి చూశారు. అప్పటిదాకా పటేలు పురి ఎక్కించి చెప్పిన మాటలతో హావల్దారు పళ్ళు పటపటా నూరాడు. హఠాత్తుగా లేచిపోయి బ్రహ్మారెడ్డిపై విరుచుకుపడ్డాడు. చేతిలో నున్న నల్లని లండాతో గభీగభీమని బాదాడు. బ్రహ్మారెడ్డి నేలమీద కూలిపోయాడు.

"మాదచ్చోత్, అకల్‌నహి?" అంటూ వెనక్కి తిరిగి వచ్చి కూర్చున్నాడు హావల్దారు.

బ్రహ్మారెడ్డి తిన్న దెబ్బలు చూసి మిగతా వారెవరూ నోరు మెదపలేదు. కిక్కురు మనకుండా ఎక్కడి వారక్కడే దుమ్ములో కూలబడ్డారు. చూస్తుండగానే పొద్దునెత్తిమీదికొచ్చింది.

అప్పుడే జానకిరాంరెడ్డి వెట్టివాళ్ళచేత బరికెల మోపులు ఎత్తించుకుని వచ్చాడు. అది చూసి హావల్దారు, సిపాయిలు ఆయత్తమయి నిల్చున్నారు. అందరూ కలిసి ఆవులదొడ్డిలోకి ప్రవేశించారు. పటేలు రాసి అందించిన కాగితాన్ని తీసుకున్నాడు. హావల్దారు కాగితంలో చూసి "కోదండరాంరెడ్డి" అంటూ పేరు పెట్టి పిలిచాడు.

కోదండరాంరెడ్డి నెమ్మదిగా లేచి ఎదురుగా వచ్చి నిల్చున్నాడు.

"ప్రతాప్‌రెడ్డి ఎక్డా ఉన్నాడురా?" గద్దించి అడిగాడు హావల్దారు.

"నాకేం తెలుసునయ్యా?" అన్నాడు కోదండరాంరెడ్డి.

"నిన్న ఎక్డా ఉన్నాడు?"

"మా ఇంట్లోనే ఉన్నాడు"

"రాత్రీ ఎక్డా ఉన్నాడు?"

"మా ఇంట్లోనే ఉన్నాడయ్యా"

"మరీ మేం సోదా చేసినప్పుడు ఎక్డా ఉన్నాడు?"

"ఏమోనయ్యా"

"పటేల్ వరి పొలం అంతా కోయించుకుని వచ్చినవూ?"

"నాకేం తెలియదయ్యా"

హావల్దారు మండిపడ్తూ "అన్నీ తెలియదంటావు భాంచోత్" అన్నాడు. ఆ కోపంలో బూటుకాలితో ఒక్క తన్ను తన్నాడు. కోదండరాంరెడ్డి విరుచుకు కిందపడ్డాడు. పడ్డవానిపై బడి సిపాయిలు తుపాకి మడమలు తిరగేసి గుద్దారు. కోదండరాంరెడ్డి లబోదిబోమన్నాడు. అతడి కాళ్లూచేతులూ అంటగట్టి కోళ్ల కొక్కిరాయి వేశాడు. ఉడుకు దుమ్ములో పడేశారు.

తర్వాత వరుసగా అందరినీ పేర్లు పెట్టి పిలిచాడు. హావల్దారు ఒక్కొక్కరినీ చింతబరికెలు విరిగిపోయేదాకా బాది పక్కన నిలబెట్టిస్తున్నాడు.

"కనకం" అని పిలిచాడు హావల్దారు.

ఆ పిలుపుకు బొర్ర కనకం లేని నిలబడ్డాడు. అతడి ఆకారం వైపు చూసి హావల్దారు నవ్వాడు. "అరే కనకం ఇద్దర్ మనుషుల్ వజక్ ఉండావురా? పటేల్ మాగాణిలో ఎన్ని మోపుల్ ఎత్కావచ్చినవు చెప్పు?'' అనడిగాడు.

"నాకేం తెలియదయ్యా" అన్నాడు కనకం. అతడు వణికిపోతున్నాడు. అతడితోపాటు అతడి బొర్ర కూడా భూకంపం వచ్చినట్లు కదిలిపోతోంది.

"అరే కనకం, నీకు చానా బలం ఉంది. నీవు రెండు మోపుల్ ఎత్కా వచ్చినవు కదూ?" అన్నాడు హావల్దారు.

"ఛాత్ బద్మాష్" అనరిచాడు హావల్దారు. వెంటనే సిపాయిలకు సౌంజ్ఞ కావించాడు. సిపాయిలు కనకంపైబడి బాదారు. అతడు కుయ్యోమొర్రో అని మొత్తుకున్నాడు.

"పుల్లారెడ్డి" అని పిలిచాడు హావల్దారు.

పుల్లారెడ్డి వచ్చి ఎదురుగా నిల్చున్నాడు.

"అరే ముసిలోడా నీవేం చేసినవురా?" అనడిగాడు హావల్దారు.

"ఏం చేయలేదయ్యా?"

"నీవు ఏం చేయకుండా నీ పేర్ ఇక్కడ ఎట్లా ఉందీ?"

"ఏమోనయ్యా"

అంతలో పటేలు కలిగించుకున్నాడు. "వీడి కొడుకు సంగంలో ఉన్నాడండీ. వాడిపేరు మల్లారెడ్డి" అన్నాడు.

"ఏమిరా ముసిలోడా? నీది కొడ్కాని మాది గొంతుల్ కోసిరమ్మని సంగంలోని పంపించినవు?" అనడిగాడు హావల్దారు.

"నేను పంపలేదయ్యా"

తలూపాడు హావల్దారు. సిపాయిల వైపుకు చూశాడు. సిపాయిలు పుల్లారెడ్డిని అవతలకు ఈడ్చుకుపోయి బాదనారంభించారు.

తర్వాత హావల్దారు పేరు పిలిచాడు.

"పెంటయ్యా"

"అబ్బురాం"

"సుందరం"

"మరియదు"

ఆ విధంగా పిలుస్తూంటే వాడలో ఉన్న వారందరూ లేచారు. వారందరివైపుకూ పరీక్షగా చూశాడు హావల్దారు. "ఏమిరా మీరందరూ సంగం చేసి పటేలు మాగాణి అంతా కోస్కాపోయినరు గదూ?!" అనడిగాడు.

"అంతా ఒట్టిదేనయ్యా" అన్నారందరూ ఒక్కసారిగా. అంతలో ఒక్కడే ఉన్న రూబేను ముందుకు వచ్చాడు.

"వీళ్లంతా పటేలుగారి మాగాణిలో మోపులు కట్టుకుని ఎత్తుకపోతోంటే నేను చూశాను" అన్నాడు.

హావల్దారు తలూపాడు. రూబేను మాట్లాడిన కటిక అబద్ధాలకు వాడజనం అంతరికీ



ఒళ్లుమండింది.

"ఓరి తాగుబోతు నాయాల" అని తిట్టాడు పెంటయ్య.

"మా మీద అబద్ధాలు చెబుతావురా" అన్నాడు మరియుడు.

"నీది నోరా, వల్లకాడా" అన్నాడింకొకడు.

"మమ్మల్ని కొట్టిస్తే నీకేం ఒరుగుద్దిరా" అన్నాడొకడు.

''ఈ మిడిసిపాటు ఎన్నాళ్లలే'' అన్నాడింకొకడు.

ఈ విధంగా వాడ జనాభా రూబేనును తిట్టిపోస్తున్నారు. రూబేను హావల్దారు వైపుకు తిరిగి "చూడండయ్యా నన్ను ఊరికే ఎట్లా తిడుతున్నారో" అన్నాడు.

హావల్దారు వాడ వారందరివైపు ఉరిమిచూశాడు. "మారో బద్మాష్ లోగోంకో" అంటూ ఆజ్ఞాపించాడు. సిపాయిలు చింతబరికెలు తీసుకుని వాడ ప్రజలపై విరుచుకుపడ్డారు. చింతబరికెల బరాటాలతో ఆ ప్రదేశమంతా మోతపుడుతోంది. అందరి వీపులూ మంటపుట్టిపోతున్నాయి. కేకలు, బొబ్బలతో కొండమొరలు పెడ్తున్నారు.

బ్రహ్మారెడ్డి కల్పించుకున్నాడు. "ఇదేం అన్యాయమయ్యా? పాపం పుణ్యం తెలియని వాళ్లను పట్టుకుని చావబాదుతున్నారు" అన్నాడు.

అది విని పటేలు పళ్ళు కొరికి "వీణ్నే ముందు తన్నండి" అన్నాడు హావల్దారు వైపుకు చూస్తూ.

హావల్దారు సిపాయిలను ఇద్దరినీ పిలిచి బ్రహ్మారెడ్డికేసి చూస్తూ సౌంజ్ఞ కావించాడు. మరుక్షణమే సిపాయిల చేతిలోని చింతబరికెలు బ్రహ్మారెడ్డి వీపుపై మారుమోతలు పెట్టించినాయ్.

బ్రహ్మారెడ్డి ఊరు లేచిపోయేటట్లు కేకలు పెట్టసాగాడు. పైన దెబ్బలు పడుతున్నా పటేలును బండబూతులు తిట్టసాగాడు.

"ఒరే పటేలూ, నీ ఆలి ముండమొయ్య, నీయమ్మా.... నీ ఇల్లు వల్లకాటి బూడిదయిపోను. నన్నెందుకు కొట్టిస్తావురోయ్. నువ్వేం బావుకుంటావ్‌రోయ్" అంటూ తిడుతున్నాడు. అప్పటికే అతడి వీపంతా పగిలి నెత్తురు చిమ్ముతోంది.

హావల్దారు దగ్గరికి వచ్చాడు. "ఏమిరా గడ్‌బిడ్ చేస్తున్నావ్? నోరుమూస్కుని దెబ్బల్‌తినలేవు?" అన్నాడు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల

సిటీ కల్చర్!

"దిసీజ్ టూమచ్ కల్పనా... అయినా నువ్వేంటి, ఇంతగా ఫీలవుతున్నావ్? నువ్వు నా చిన్ననాటి ఫ్రెండ్‌వి. మన మధ్య అలాంటి మాటలెప్పుడూ రాలేదే. అయినా అనిపించుకునే వాళ్లు... వాళ్లకే అంత ఇది లేనప్పుడు అనేవాణ్ణి నాకెందుకు బాధ చెప్పు"

"అలా కాదురా....."

"ఒరేయ్... నేను చెప్పేది కాస్త వింటావా....."

"ఇప్పుడు చెప్పవే....."

"ఒసేయ్... ఎందుకే నీకంత కోపం....."

ఈ మాటలు ఎవరు ఎవరితో మాట్లాడతారో చెప్పగలరా? పోనీ ఊహించగలరా? అబ్బో... ఇదేమంత కష్టమైన విషయమా ఏంటి ఊహించలేకపోవడానికి? ఇంత క్లోజ్‌గా మాట్లాడుకుంటున్నారంటే కచ్చితంగా ఫ్రెండ్సే అయుంటారు. అవునండి... మీరు హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్. మరి ఇలాంటి మాటలు కేవలం అమ్మాయిల మధ్యనో, పూర్తిగా అబ్బాయిల మధ్యనో చోటుచేసుకున్నాయనుకోండి? అనుకోడానికేం లేదు ఈ టాపిక్ ఇక్కడ చర్చించాల్సిన అవకాశమే వచ్చేది కాదు. అంటే ఈ మాటలు అమ్మాయిలు అబ్బాయిల మధ్యా...? అదెలా సాధ్యం? అయినా అలా ఎలా మాట్లాడుకుంటారు బాబూ... చదువుతుంటేనే అనీజీగా ఉంది. మీ మనోగతం ఇదేనా? అయితే "స్నేహితులన్న తర్వాత అబ్బాయిలూ ఉంటారు. అమ్మాయిలూ ఉంటారు. ఫ్రెండ్‌షిప్‌లో అలాంటి తేడాలేవీ ఉండకూడదు. అందుకే మీరు, ఏవండి లాంటి ఫార్మాలిటీస్ మేం అస్సలు పాటించం" ఇదీ నేటి యువత అంతరంగం. ఫ్రెండ్‌షిప్‌లో ఫార్మాలిటీస్ అవసరమా? అవసరమైతే ఎంతవరకు? నువ్వు అంటూ మొదలై... ఒరేయ్, ఒసేయ్ అనుకునే వరకూ సాగే ఈ స్నేహం సరైనదేనా?

"ఔను... ఫ్రెండ్‌షిప్‌లో మర్యాదలు పాటించాలా? అంటే మీ ఉద్దేశం ప్రకారం అబ్బాయిలను మీరు అంటూ గౌరవించాలి. సరే అలాగే అనుకుందాం? అయినా నాకో డౌటు. అలా సంభోదిస్తే వాళ్లు స్నేహితులెలా అవుతారు. అసలు అలాంటి మాటలన్నీ దగ్గరతనాన్నే తెలుపుతాయి. ఎంతో క్లోజ్ అయితేనే గదా అలా మాట్లాడుకుంటాం. అమ్మాయిలతో మాట్లాడుతున్నాం అన్న భావన వారిలో కలగకూడదంటే ఇలాంటి మర్యాదలకు గుడ్‌బై చెప్పాలనే నా అభిప్రాయం. దీనిపైన ఎలాంటి కామెంట్స్ నేను వినదల్చుకోలేదు" అంటూ తన వాదనను గట్టిగా సమర్థించుకుంటోంది ఖుషి.

"మనసులో ఎటువంటి దురుద్దేశాలూ లేనివారే ఇలా మాట్లాడుకుంటారు. ఒకవిధంగా చెప్పాలంటే నేనూ దాన్ని సమర్థిస్తాను. దానికే మద్దతిస్తాను" అంటోంది ఓ ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థిని. మరి అబ్బాయిల సంగతేంటి? వారి ఉద్దేశాలెలా ఉంటాయి? వాళ్లూ ఇలానే ఆలోచిస్తారా? అని మెలకెత్తిన ప్రశ్నలకు 'కాదు' అనే సమాధానాన్నిస్తోంది కల్పన అనుభవం. అదేంటంటే...

"దిసీజ్ టూమచ్ కల్పనా... అయినా నువ్వేంటి, ఇంతగా ఫీలవుతున్నావ్? నువ్వు నా చిన్ననాటి ఫ్రెండ్‌వి. మన మధ్య అలాంటి మాటలెప్పుడూ రాలేదే. అయినా అనిపించుకునే వాళ్లు... వాళ్లకే అంత ఇది లేనప్పుడు అనేవాణ్ణి నాకెందుకు బాధ చెప్పు"

"ఎందుకు నీ ఫ్రెండ్స్‌ను ఏయ్, ఒసేయ్ అంటావ్?" అనడిగినప్పుడు అభిజీత్ ఇచ్చిన ఎక్స్‌ప్లనేషన్... నాకో పెద్ద షాక్! నా స్నేహితులు, చాలామంది అమ్మాయిలు అలా మాట్లాడుకోవడాన్ని క్లోజ్‌నెస్ అని భావిస్తారే గానీ... అబ్బాయిలు దీన్నలా ఇంటర్‌ప్రిట్ చేస్తారని అనుకుని ఉండరు. కనీసం అలా ఊహించే సాహసమూ చేసి ఉండరు. బహుశా అబ్బాయిలందరూ ఇలానే ఆలోచిస్తారేమో... అతను నా చిన్ననాటి స్నేహితుడు కాబట్టి నాముందు బయటపడ్డాడు" అని చెబుతోంది సైకాలజీ విద్యార్థిని కల్పన.

"నువ్వు అంటూ సాగే సంభాషణ విని ఎన్నో ఏళ్లనుంచీ పరిచయస్తులేమో అనుకునేదాన్ని. కానీ ఈ సిటీకొచ్చిన తర్వాతే తెలిసింది ఇలా మాట్లాడుకోవడానికి కేవలం ముఖపరిచయం చాలని. ఏంచేస్తాం? సిటీ కల్చర్... ఇష్టం లేకపోయినా అలవాటు పడాలి తప్పదు" అంటోంది కోఠి ఉమెన్స్ కాలేజీ విద్యార్థిని.

"ఈమధ్య నాకో అబ్బాయి పరిచయమయ్యాడు. అతను టీవీ యాంకర్. పలకరింపుతోనే 'నువ్వు' అనడం మొదలెట్టాడు. నాకు చిరాకొచ్చింది. అయినా అతన్ని నేనేమీ అనలేదు. కానీ నా స్నేహితురాలికి విషయం చెప్తే "ప్రతి విషయాన్నీ భూతద్దంలోంచి చూస్తావెందుకు? అతను యాంకర్ కదా. క్లోజ్‌గా మాట్లాడడం అలవాటైపోయుంటుంది. అయినా ఈ రోజుల్లో చాలామంది ఇలానే మాట్లాడుకుంటున్నారు తెలుసా?" అంది. ఆమె మాటలు నాకు నచ్చలేదు. మా మధ్య నువ్వు అనుకునేంత చొరవ లేదు. అయినా అలాంటి చొరవను భరించే మనస్తత్వం కాదు నాది. ఓరోజు ఆ అబ్బాయి నాతో ఫోన్‌లో మాట్లాడుతూ... మీరు అన్నాడు. నేను ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే పేరుచివర గారు తగిలించాడు. 'ఇంత మర్యాదా? ఇతనిదీ క్యారెక్టర్ కాదే... మ్యాటరేంటబ్బా' అనుకున్నా. విషయమేంటంటే... అతను ఇంట్లో ఉన్నాడట. అంటే ఇంట్లో ఒక ముఖం, బయట మరో ముఖం తగిలించుకు తిరుగుతాడన్న మాట. ఏదేమైనా అంత చొరవ ఇవ్వడం మన ఆత్మగౌరవానికే దెబ్బ" అంటోంది జర్నలిజం విద్యార్థిని స్మైలీ. మీరేమంటారు...? ★

సినిమా కబుర్లు

చందు

కళాకారుడు బతికితే కళలను బతికించుకుంటాడు

సేవా కార్యక్రమాల్లో నా చురుకుదనం చూసి చెన్నారెడ్డిగారు రాజకీయాల్లోకి రమ్మని దుగ్గిరాల నుంచి సీట్ ఆఫర్ చేశారు. రాజకీయాలొద్దని సున్నితంగా తిరస్కరించాను. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేయండని మళ్ళీ అంజయ్యగారు ఆహ్వానించారు. రాజకీయాలంటే నాకిష్టం లేదనడంతో 'పోనీ నాటక అకాడమీ ఛైర్మన్‌గా ఉంటారా?' అనడిగితే ఒప్పుకున్నాను. అకాడమీకి ఛైర్మన్ కాగానే 40 మంది సభ్యులతో జనరల్‌బాడీ మీటింగ్ పెట్టి పేద, వృద్ధ కళాకారులకోసం పథకాలు రూపొందించసాగాను. అప్పటికే 'రంగస్థల వృద్ధ కళాకారుల సమాఖ్య' కింద రాష్ట్రమంతా తిరిగున్నాను కాబట్టి తోలుబొమ్మలు ఆడించేవారి దయనీయ పరిస్థితి గురించి తెలుసు. వారిని ఆదుకునే ప్రయత్నంలో నెలకు 200 రూపాయల సహాయార్థం లక్ష రూపాయలు పక్కన పెట్టి ఉంచా. ఈ ప్రపోజల్ మా సభ్యుల్లో కొందరికి నచ్చలేదు. 'మీరు గనుక ఈ ప్రపోజల్‌కి నో అంటే ఈరోజే రాజీనామా చేస్తా' అన్నాను. ఎప్పుడూ తెల్ల గుర్రం ఎక్కి కూర్చునే ఒక సభ్యుడు 'సినిమా అమ్మాయి... ఈమెకు డ్రామా వాళ్ళ గురించి ఏం తెలుసు' అని చులకనచేసి మాట్లాడాడు. 'ఆ మాట అన్నావంటే మర్యాదగా ఉండదు. మీరందరూ(సభ్యులు) చాలా గొప్ప గొప్ప గ్రంథాలు రాశారు.నాటకాలు వేయడానికి విదేశాలకు కూడా వెళ్ళారు. ఒక్క పేద కళాకారుడికైనా గజం స్థలం ఇప్పించారా?' అనడిగాను. నా పాలసీ ఒక్కటే. కూడు, గుడ్డ, నీడ ఇచ్చిన రోజున కళాకారుడు బతుకుతాడు. కళాకారుడు బతికితే కళలు అవే బతుకుతాయి, బతికించుకుంటాడు. నేను ఎవరిచుట్టూ తిరిగి ఈ పదవులు తెచ్చుకోలేదు. మహానటులు ఇద్దరు బాయ్‌కాట్ చేస్తే వాళ్ళనే లెక్కచేయకుండా నా టాలెంట్ నమ్ముకుని ఆత్మ గౌరవం నిలుపుకున్నదాన్ని. పేదవాళ్ళ సహాయార్థం చేస్తున్న ఈ పని మీకిష్టం లేకపోతే చెప్పండి రాజీనామా చేసేస్తా' అని చెడామడా తిట్టి వాళ్ళతో పోట్లాట వేసుకున్నా. చివరికి వాళ్ళు మెదలకుండా ఉన్నారు. ఇంతలో ప్రభుత్వం మారింది. రామారావుగారు ముఖ్యమంత్రి అయ్యారు. మహానటుడైన ఆయన ముఖ్యమంత్రి ఐనందుకు సంతోషించినవారిలో నేనూ ఒకదాన్ని. వారిని స్వయంగా కలిసి అభినందించి గత ప్రభుత్వంవారు నామినేట్ చేశారు గనుక నైతికంగా రాజీనామా పత్రాన్ని వారికి అందించాను. రామారావుగారు అది చదివి నవ్వి 'ఏమి జమున గారూ! మీరు బాగా చేస్తున్నారని విన్నాం. మీరే ఉండి బాగా పనిచేయండి' అంటూ నా రాజీనామాను చింపేశారు. దీంతో పదవిలో కొనసాగాను. మాకు ప్రతి సంవత్సరం 6 లక్షల గ్రాంట్ వస్తుంది. మార్చి నెల వచ్చేసరికి గ్రాంట్ మొత్తం అయిపోయింది. జూన్ నెల వచ్చినా ఫండ్ రిలీజ్ కాలేదు. ఉత్తరాలు రాశాం. అయినా ఫలితం లేదు. స్వయంగా కలిసి కనీసం వృద్ధ కళాకారుల పెన్షన్ కోసం కనీసం లక్ష రూపాయిలైనా విడుదల చేయమని అడుగుదామని ప్రయత్నిస్తే రామారావుగారు ఇంటర్వ్యూ ఇవ్వలేదు. అదే సమయంలో మానుండి పెన్షన్ పొందుతున్న 90 ఏళ్ళ నిరుపేద తోలుబొమ్మల కళాకారుడొకడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఒక మహానటుడు తోటి కళాకారుల గురించి పట్టించుకోవడం లేదన్న వైనాన్ని పత్రికల ద్వారా విమర్శించాను.

వ్యాపారంగా, ఫ్యాషన్‌గా రాజకీయాలు

రాజీవ్‌గాంధీ చనిపోయిన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చాను. రాజకీయాలు పోనుపోను... వ్యాపారంగా మారిపోయాయి. లక్షలు ఖర్చుపెట్టి కోట్లు సంపాదించే వ్యాపారంగా తయారైంది. కోటీశ్వరులకు పదవి ఫ్యాషన్ అయిపోయింది. మనకింకా ఈ రాజకీయాలొద్దు బాబూ! అని ఇంట్లో కూర్చుని ఆధ్యాత్మికంవైపు మనసు మళ్ళించాను. ఇంకా కొన్ని కుటుంబ బాధ్యతలు ఉన్నాయి కదా... మాకొక అబ్బాయి, అమ్మాయి. అబ్బాయి పేరు వంశీకృష్ణ. సాఫ్ట్‌వేర్ ప్రొఫెసర్. అమెరికాలో ఉంటున్నాడు. పాప పేరు స్రవంతి. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. పెళ్ళి చేయాలి.

ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోను

సినిమా ఇండస్ట్రీలో ఏ తారా ఎదుర్కోని దురదృష్టకర పరిస్థితిని నేను ఫేస్ చేశాను. పరిశ్రమలో ఇద్దరు పెద్ద హీరోలు నన్ను బాయ్‌కాట్ చేశారు. నేనూ వాళ్ళని బాయ్‌కాట్ చేశాను. దీంతో 'పొగరుబోతుది'.... లాంటి బిరుదులిచ్చారు. ఈ పరిస్థితి నా విషయంలోనే ఎందుకొచ్చిందంటే మొదటినుంచీ వ్యక్తిత్వానికి గౌరవం ఇస్తూ వచ్చాను. నా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోను. ఇది నిలుపుకునే ప్రయత్నంలో ఇటువంటి సంఘటనలు కొందరు మగవాళ్ళ ద్వారా ఫేస్ చేయక తప్పదు. దీన్ని ఎదుర్కొని నిలిచాను. నా కెరీర్ మీదే దెబ్బ కొట్టాలని ఆ ప్రముఖులు చూశారు. దీంతో దారిన పోయే దానయ్య పక్కన యాక్ట్ చేయడానికైనా సిద్ధమే అని లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటించడం మొదలుపెట్టాను. నా టాలెంట్ మీద నాకు నమ్మకం ఉంది. దీంతో హరనాథ్, రమణమూర్తి, కైకాల సత్యనారాయణ సరసన కథానాయికగా నటించి హిట్స్ అందించి లక్కీ హీరోయిన్ అనిపించుకున్నాను. ఇంతలో గౌరవప్రదంగా రాజీ కుదర్చడంతో 'గుండమ్మ కథ' చిత్రంలో నటించాను. ఇదొక దురదృష్ట సంఘటన అని చెప్పను కానీ ఒక తమాషా సంఘటన. ఇది ఎవరికీ జరగనిది. కానీ ఇందులో నేనే గెలిచాను. పెళ్ళయిన తర్వాత ఏడేళ్ళపాటు బాబు. పాప పుట్టేవరకూ నటించా. 25 సంవత్సరాలపాటు ఏకధాటిగా హీరోయిన్‌గా నటించి చివరి మూడు సంవత్సరాలు అడపాదడపా నటించాను. నేను పోషించిన ప్రతి పాత్రా ఎనలేని పేరుప్రఖ్యాతులను తెచ్చిపెట్టింది.

'పుట్టినిల్లు' మళ్ళీ రిలీజ్ చేద్దామనుకుంటే...

సామాన్యంగా సినిమా వాళ్ళలో కృతజ్ఞతాభావం ఉండదు. పరిచయం చేసిన వాళ్ళనే మరచిపోతూ ఉంటారు. 'పుట్టినిల్లు' చిత్రం ద్వారా నన్ను పరిచయం చేసిన డా॥ రాజారావుగారు చనిపోయిన తర్వాత వారి కుటుంబాన్ని ఆదుకున్నాను. చెన్నైలో ఇల్లు కొనిపెట్టాను. నా తొలి 'పుట్టినిల్లు' చిత్రాన్ని మళ్ళీ రిలీజ్ చేద్దామనుకుంటే దాని తాలూకు ప్రింట్‌గానీ, నెగిటీవ్‌గానీ దొరకలేదు.

తమాషా ఫీలింగ్ కలుగుతూ ఉంటుంది

నా చిత్రాలు చూస్తున్నప్పుడు 'అబ్బా ఎంత గొప్పగా యాక్ట్ చేశాం. గొప్ప గొప్ప డైరెక్టర్లతో పనిచేశాం. జీవితం అయిపోయింది కదా! అనిపించినా, అంతలోనే చనిపోయాక్కూడా ప్రేక్షకుల హృదయాల్లో జమున ఉండి పోతుంది కదా అనిపిస్తూ ఉంటుంది. రామారావుగారు మన మధ్యన లేకపోయినా ఆయన సినిమాలు చూస్తుంటే ఆయనింకా మన మధ్యన ఉన్నట్టే ఫీలింగ్ కలుగదూ?! నేనూ అంతేకదా అనే తమాషా ఫీలింగ్ కలుగుతూ ఉంటుంది. ★

దసరా పండుగ కదా. అందుకని చిట్టి షాపింగ్‌కి బయల్దేరింది.

ఎస్.శైలజ, 7వ తరగతి, ప్రగతి బాల విద్యాలయం, సుందరయ్య నగర్, తాడేపల్లి (మం), గుంటూరు జిల్లా.

చిట్టీ... నన్నూ తీసుకెళ్లవా... అలాచేస్తే రోజూ మార్కెట్‌కెళ్లి కూరగాయలు తెచ్చిపెడ్తా.

ఎ.సలేశ్వర్, 7వ తరగతి, జడ్.పి.హైస్కూల్, గోపాల్‌పేట్, మహబూబ్‌నగర్ జిల్లా.

నన్ను తీసుకెళ్తే... రోజూ రుచికరమైన వంటలు వండిపెడ్తా.

తమ్మిశెట్టి రవిబాబు, 7వ తరగతి, ప్రగతి బాల విద్యాలయం, సుందరయ్యనగర్, తాడేపల్లి (మం), గుంటూరు జిల్లా.

చిన్నారి చిత్రకారులు

నేనైతే... సచిన్‌లా సెంచరీ చేయడం నేర్పిస్తా. నన్ను తీసుకెళ్లవా ప్లీజ్....

జి.అశోక్‌కుమార్, 8వ తరగతి, (అడ్రస్ రాయలేదు.)

నేనైతే... సంగీతంతో నీకు ఆహ్లాదాన్నిస్తా...

వేంద్ర భార్గవ్ తేజస్, 8వ తరగతి, విద్యా పబ్లిక్ స్కూల్, నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

నీకేదైనా ఆపద వస్తే ఆఘమేఘాల మీద వచ్చి ఆదుకుంటా... మరి నన్ను...

బి.శ్రావణి, 7వ తరగతి, ప్రగతి బాల విద్యాలయం, సుందరయ్యనగర్, తాడేపల్లి (మం), గుంటూరు జిల్లా.

అదే నేనైతే... నిన్ను రోజూ నా ఆకు పడవలో షికారుకు తీసుకెళ్తా. మరి నన్ను నీతోపాటు తీసుకెళ్తావా?

కోట దానియేల్, 10వ తరగతి, ముప్పాళ్ల, చందలపాడు (మం), కృష్ణా జిల్లా.

అబ్బా... ఏం కోతలు కోస్తున్నారు. అయినా ఇవేవీ చిట్టి నమ్మదు. తనొక్కటే షాపింగ్ కెళ్తుంది. అదిగో నేను అనుకున్నట్టే జరిగింది.



కె.కృష్ణతేజ, 9వ తరగతి, నవోదయ మోడల్ స్కూల్, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా.

మీరూ ఈ నేస్తాల్లా చక్కటి బొమ్మలేస్తారా? మరైతే ఆలస్యమెందుకు? రాబోయే దీపావళిని దృష్టిలో పెట్టుకొని చక్కటి బొమ్మలు వేసి, మాకు పంపించండి. ఎంచక్కా ఊరు, పేరుతోసహా ప్రచురిస్తాం. మీ బొమ్మలు మాకు చేరాల్సిన చిరునామా:

చిన్నారి చిత్రకారులు,
ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం.1,
అశోక్ నగర్,
హైదరాబాద్.

నాకు పూలు కావాలర్రా



చేపలో చిక్కిన పదాలేవి

హేయ్! నా బొజ్జలో సముద్రానికి సంబంధించిన పదాలు 5 వున్నాయి. కాకపోతే...వాటి స్పెల్లింగు క్రమపద్ధతిలో లేదు. మీరే ఒక పద్ధతిలో రాయాలి. ఎంతకీ జవాబు తెలీకపోతే మా ఆన్సర్ చూడండే.



జవాబు: 1.waves. 2.ocean. 3.whale. 4.water. 5.diver

ఇవి ఎక్కడున్నాయబ్బా...

చిన్నారులూ...కింద డాన్స్ చేస్తున్న జంతువు బావుందికదూ. చక్కగా డ్రస్సుకూడా వేసుకుంది. అసలు విషయం ఏంటంటే... బొమ్మపైన ఆరు ఆకారాలున్నాయి చూశారా. అవి బొమ్మలో ఎక్కడున్నాయో కనుక్కోవాలన్నమాట. మరి ఆలస్యం ఎందుకూ....



మేం చెప్పిన రంగులెయ్యండే

అంకెలు, గీతల మధ్యలో ఓ అల్లరిపిల్ల దాగింది. అదెవరో తెలియాలంటే... మేం చెప్పిన రంగులద్దండే. 1-బ్రౌన్ , 2-బ్లాక్ , 3-రెడ్, 4-గ్రీన్.



అట్టమీది కథ



కొత్త సంగీత లోకం... ఎఫ్ఎమ్

బీరెడ్డి నగేష్

'ఏంటీ సంగతి'
'పాప ఏడ్చింది'
'ఉడ్వర్డ్స్ పట్టమని వాళ్లమ్మతో చెప్పు'
...అని రేడియోలో అడ్వర్టయిజ్‌మెంట్ వస్తుంటే. 'పిల్ల పీకమీద కాలేసి తొక్కమను పీడా పోద్దీ' అని విసుక్కునేది స్వప్న. అంతటితో ఆగకుండా 'ఏంటి తాతయ్యా..! చదువుకోనీకుండా... ఎప్పుడూ ఆ రేడియోతో..' అని చిర్రుబుర్రులాడేది. ఇది స్వప్న చిన్నప్పుడు. ఇప్పుడు కాలం మారింది. అది కారువేగంగా కదిలింది. ఆ వేగంలో ఎన్నో మార్పులు... 'మీరు వింటున్నారు... 108 ఎఫ్ఎమ్ రేడియో మిర్చి... ఇది చాలా హాట్ గురూ...' అని ఎఫ్ఎమ్ రేడియోలో వస్తుంటే... 'అయితే బాగా కాల్తుందేమో' అని గొణుగుతూ స్వప్న తాతయ్య రేడియో కట్టేయబోయాడు. 'అయ్యో! తాతయ్యా కాసేపు విననీ, ఇప్పుడు నా ఫేవరేట్ ప్రోగ్రామ్ వస్తుంది' అని రేడియో లాక్కుని వెళ్తోంది స్వప్న.

ఔను... ఇప్పుడు ఎఫ్ఎమ్ రేడియో సగటు మనిషికి అంత దగ్గరైంది. అవుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే జీవితంలో ఒక భాగమైంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో రత్నాలు కువ్వలుగా పోసి అమ్మేవారట. ఇప్పుడు సికింద్రాబాద్ స్టేషన్లో ఎఫ్ఎమ్ రేడియోలను అలా రాశులుగా పోసి అమ్ముతున్నారు. మా తాతయ్య తనకాలంలో రేడియో కొనేందుకు ఆస్తులమ్ముకున్న వారున్నారని చెబుతుంటారు. పచాస్‌మే దునియా అన్నట్లు 50 రూపాయలకే ఓ కొత్త సంగీత లోకాన్ని అందిస్తున్నాయి. ప్రాంతీయ భాషల్లో ప్రసారాలను కొనసాగిస్తూ అతితక్కువ సమయంలో శ్రోతలకు చేరువవుతున్నాయి. శ్రోతల నాడి తెలుసుకుని వారికి నచ్చే కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాయి. వారి రుచికి, సంస్కృతికి, భాషకు అనుగుణంగా ఈ ప్రసారాలుంటున్నాయి. ఎఫ్ఎమ్‌కు శ్రోతలనే కాదు, వాణిజ్య ప్రకటనలకర్తలనూ అందిస్తోంది. దీంతో ఎఫ్ఎమ్‌లోనూ ప్రకటనలు పెరుగుతున్నాయి.

రేడియో చరిత్ర

భారతదేశంలో రేడియో ప్రసారాలు 1927లో ప్రారంభమయ్యాయి. ముంబాయి, కలకత్తాల్లో రెండు ప్రయివేటు సంస్థలు ఈ ప్రసారాలను ప్రారంభించాయి. 1930లో ప్రభుత్వం వాటిని జాతీయం చేసింది. 1936 వరకు ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ పేరుతో ఆ ప్రసారాలు సాగాయి. ఆ తర్వాత దానికి ఆలిండియా రేడియోగా పేరు మార్చారు. దీన్ని 1957లో ఆకాశవాణిగా మార్చారు. ఆ తర్వాత అనతి కాలంలోనే రేడియో కుగ్రామాలకూ విస్తరించింది. 1967 నుండి రేడియోలో వాణిజ్య ప్రకటనలకు అనుమతించాలని నిర్ణయించారు. 1990 నాటికి 46 స్టేషన్లు ఏర్పడ్డాయి. 1970 నుండి 1994లోగా 14 నుండి 65 మిలియన్ల శ్రోతలకు రేడియో దగ్గరైంది. ఈ కాలంలో సుమారు 90 శాతం మంది రేడియో వినేవారు. 200 (ఎ నా ం కేంద్రాలతో, 2 4



భాషల్లో ప్రసారాలు చేస్తూ ఆకాశవాణి దేదీప్యమానంగా వెలుగొందింది. అటు తర్వాత టీవీ ప్రవేశించడంతో వీటి మధ్య పోటాపోటీ నెలకొంది. చివరికి దూరదర్శన్‌లో ప్రైవేట్ ఛానల్స్ మాదిరిగానే ఇందులోనూ ప్రైవేట్ స్టేషన్లొచ్చాయి.

ప్రయివేటీకరణ

ఆర్టీసీ నుండి అన్ని రంగాలనూ ప్రభుత్వం ప్రయివేటు పరం చేస్తోంది. ఈ వేటు ఆలిండియా రేడియోకూ తప్పలేదు. 1993 వరకు ఆలిండియా రేడియో ప్రభుత్వాధీనంలో నడుస్తుండేది. ప్రయివేటు వారికి అనుమతినిచ్చేవారు కాదు. 1994లో అంతర్జాతీయంగా రేడియో ప్రసారాల్లో మరింత నాణ్యత, స్టీరియోఫోనిక్ సౌండ్ అవసరం ఏర్పడింది. ఇది ఆలిండియా రేడియో ప్రయివేటీకరణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో 1994లో రేడియో ప్రసారాలలో ప్రయివేటు వారిని అనుమతించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. 1999 జూన్6న అప్పటి భారత ప్రభుత్వం రేడియో పరిశ్రమలో ప్రయివేటు సెక్టార్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. దీన్నే ఫేజ్-1 పాలసీ అంటారు. దీని ప్రకారం పది సంవత్సరాలపాటు ప్రయివేటువారు ప్రసారం చేసుకునేలా టెండర్లను పిలిచి వారికి లైసెన్సు అందజేసింది. ఈ క్రమంలో మార్చి, 2000లో ఆలిండియా రేడియో ఎఫ్ఎమ్ (87 ఎమ్‌హెచ్‌జెడ్) రేడియోగా రూపాంతరం చెందింది. దేశవ్యాప్తంగా 4 0

నగరాల్లో 108 ఎఫ్‌ఎమ్ రేడియో ఛానళ్లను ప్రారంభించాలన్నది ఫేజ్-1 పాలసీ అసలు సూత్రం. ఇందుకోసం ప్రభుత్వం 101 బిడ్లను తీసుకుంది. వీటిలో ఒక్కొక్క బిడ్డుకు సుమారు 4.25 బిలియన్ల రూపాయలు ప్రయివేటువారి నుండి తీసుకోవాలని నిర్ణయించింది. వాటి విస్తరణను బట్టి ఇది ప్రతి సంవత్సరమూ 15 శాతం పెరుగుతుంది. ఫేజ్-1 పాలసీ కింద దేశవ్యాప్తంగా 14 నగరాల్లో 26 రేడియో ఛానళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం పదో పంచవర్ష ప్రణాళిక ప్రకారం దేశంలోని అన్ని చిన్న పట్టణాల్లో కూడా ఎఫ్‌ఎమ్ సర్వీసులను స్థాపించాలని ఉంది. దీనిలో భాగంగానే 2005 జులై, 13న ఫేజ్ - 2 పాలసీ ప్రకటించింది. దీని ప్రకారం త్వరలో వివిధ ప్రయివేటు సంస్థల ద్వారా 91 పట్టణాల్లో 338 రేడియో ఛానళ్లు అందుబాటులోకి రానున్నాయి.

ఎఫ్‌ఎమ్ అవతరణ

ఆరు సంవత్సరాల క్రితం మెట్రో నగరాల్లో మాత్రమే ప్రారంభమైన ఎఫ్‌ఎమ్ రేడియో అనతి కాలంలోనే 40 నగరాల్లోకి ప్రవేశించింది. రానున్న కాలంలో ప్రతి పట్టణవాసికీ కూడా అందుబాటులోకి రానుంది. ప్రాంతీయ భాషలో సంగీతాన్నందిస్తూ వారి ఇష్టాయిష్టాలు తెలుసుకుని వారికి నచ్చేలా ప్రసారాలు కొనసాగించేలా నిర్వాహకులు జాగ్రత్త వహిస్తున్నారు. 40 నగరాల్లో ఎఫ్‌ఎమ్‌ను స్థాపించేందుకు 2000 సంవత్సరంలో ప్రభుత్వం వేసిన వేలంలో ఎక్కువ శాతం ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ ఇండియా లిమిటెడ్(ఇఎన్ఐఎల్) కైవసం చేసుకుంది. దీంతో ఇఎన్ఐఎల్ ఓ అంతర్జాతీయ సంస్థగా అవతరించింది. దీంతో ఇండియాలో ఎఫ్‌ఎమ్ రేడియో ఓ వ్యాపార పరమైన సంస్థగా నాలుగు మెట్రో నగరాల్లో, సుమారు పది నగరాల్లో ఆవిర్భవించింది. మనరాష్ట్రంలోని రెండు ప్రధాన నగరాలు స్టీల్ సిటీ, హైటెక్ సిటీవాసులకు ఎఫ్‌ఎమ్ అందుబాటులో ఉంది. రాష్ట్ర రాజధానిలో ఐదు ఎఫ్‌ఎమ్ ఛానళ్లు ఉండగా తాజాగా మరొటి ప్రారంభమైంది. విశాఖపట్నంలో ప్రస్తుతానికి ఒక ఎఫ్‌ఎమ్ ఛానల్ ప్రసారాలు సాగిస్తోంది.

రేడియో చరిత్రలో ముఖ్య ఘట్టాలు

1935	రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయి(ఎఐఆర్)
1977	మొదటి ఎఫ్‌ఎమ్ సర్వీస్ ప్రారంభమైంది.(మద్రాస్)
1993	ఐదు పట్టణాల్లో ఎయిర్ ప్రయివేటు పరమైంది.
1999	ప్రయివేటీకరించబడింది (ఫేజ్-1 పాలసీ)
2001	ప్రయివేటు రేడియో వారికి లైసెన్సులిచ్చారు.
2005	ఫేజ్ - 2 ప్రయివేటీకరణ ప్రారంభమైంది.

తగ్గిన ఆడియో మార్కెట్

ఎఫ్‌ఎమ్ రేడియో ఆవతరణ ఆడియో రంగానికి గొడ్డలి పెట్టుగా మారింది. అవతరించిన ఆరు సంవత్సరాల్లోనే అనుకోని రీతిలో విజయాన్ని సాధించింది. రోజురోజుకూ ఎఫ్‌ఎమ్ అభిమానులు పెరుగుతున్నారు. ఇందుకు నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. కొత్త చిత్రాలలోని పాటలను శ్రోతలకు అందిస్తున్నారు. దీంతో ఆడియో మార్కెట్ కొనుగోళ్లు తగ్గాయి. ఈ ఆరేళ్ల కాలంలో ఆడియో మార్కెట్ 30 శాతం దెబ్బతిన్నదని అంచనా. భవిష్యత్తులో ఈ శాతం మరింత పెరగనుందని ఆడియో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



పెరుగుతున్న వాణిజ్య ప్రకటనలు...

గతంలో కార్యక్రమాల మధ్య అప్పుడప్పుడు ప్రకటనలిచ్చే వారు, ఇప్పుడు ప్రకటనల మధ్య అప్పుడప్పుడు కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారని టీవీలో ప్రకటనల గురించి చమత్కరించారు ఓ పెద్దాయన. ఔను నిజమే కదా. టీవీలో ప్రకటనలు ఎలా వేస్తున్నారో చూస్తూనే ఉన్నాం. మొత్తం ప్రసారాల్లో 42 శాతం ప్రకటనలే వస్తున్నాయన్నది మీకు తెలుసా. వివిధ సంస్థలు తమ వ్యాపారాభివృద్ధికి, విస్తృత ప్రచారానికి మీడియాను ఆశ్రయిస్తున్నారు. ఇందుకోసం ఎంత డబ్బయినా ఖర్చు చేసేందుకు వారు వెనుకాడ్డం లేదు. దేశ జిడిపిలో ప్రకటనలు 0.3 శాతంగా వున్నాయి. మన దేశంలో 2005లో వివిధ సంస్థలు ప్రకటనల కోసం ఖర్చు చేసిన మొత్తం ఎంతో తెలుసా, అక్షరాలా 111 బిలియన్ల రూపాయలు. ఇది 2006లో 14.2 శాతానికి పెరగనుంది. అంటే సుమారు 127 బిలియన్ల రూపాయలు ఖర్చు చేస్తారన్నమాట. ఈ పరిణామాన్ని మీడియా కూడా క్యాష్ చేసుకుంటోంది. వారికి అనువుగా సమయాన్నీ, స్థలాన్నీ కేటాయిస్తోంది. ఇక రేడియోల్లో ప్రకటనల గురించంటారా? ఈ తంతు 1967లో ప్రారంభమైంది. అప్పటి వరకు రేడియోలో వాణిజ్య ప్రకటనలు వచ్చేవి కావు. కాలానుగుణంగా ప్రకటనల శాతమూ పెరుగుతూ వచ్చింది. టీవీ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇప్పుడు ఎఫ్‌ఎమ్‌రేడియో అవతరించిన తర్వాత మళ్లీ ప్రకటన కర్తలనూ ఆకట్టుకుంది. ఎఫ్‌ఎమ్ మొత్తం కార్యక్రమాల్లో 39 శాతం సమయం ప్రకటనలకే కేటాయిస్తోంది. అంటే గంటకు 12 నిమిషాలు, రోజుకు 4 గంటల ఎనిమిది నిమిషాలు ప్రకటనలే.

చాలా చౌక గురూ...

ఎఫ్‌ఎమ్ రేడియో ట్రాన్సిస్టర్లు చాలా తక్కువ ధరకే దొరుకుతున్నాయి. సాధారణ ట్రాన్సిస్టర్లకు 50 రూపాయల నుండి 200 ధర ఉంది. ఇవి వివిధ సైజుల్లో అందుబాటులో ఉంటున్నాయి. శ్రోతలు జేబులో పెట్టుకుని ఎక్కడికి వెళ్లినా తీసుకెళ్లేందుకు అనువుగా ఉంటున్నాయి. దీంతో గతంలో వాడే వాక్‌మన్‌లు కనుమరుగవుతున్నాయి. ఇక కాస్త పెద్ద సైజు ట్రాన్సిస్టర్లు 150 రూపాయల నుండి 500 రూపాయల వరకు లభిస్తున్నాయి. వీటిని ఇంట్లో అమర్చుకోవచ్చు. కొందరు వాహనాల్లో వీటిని అమర్చుకుంటున్నారు. బ్రాండెడ్ ట్రాన్సిస్టర్లు 300 నుండి ఐదు వేల రూపాయల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా కొన్ని సంస్థలు సెల్‌ఫోన్లలోనూ ఎఫ్‌ఎమ్ రేడియో

వివిధ మీడియాల్లో కొనసాగుతున్న ప్రకటనల శాతం

సం..	ప్రింట్	టీవీ	రేడియో	సినిమా	అవుట్‌డోర్	ఇంటర్‌నెట్
2000	49.0	39.3	2.5	0.5	8.4	0.3
2001	48.4	40.6	2.7	0.4	7.5	0.4
2002	47.2	41.9	2.9	0.7	7.0	0.4
2003	46.6	43.0	2.9	0.7	6.5	0.4
2004	46.3	43.7	3.0	0.6	6.0	0.3

అందిస్తున్నాయి. ఉదాహరణకు నోకియా, మోటోరోలా తదితర సంస్థలు ఎఫ్ఎమ్ అందిస్తున్నాయి.

రాజధానిలో ఎఫ్ఎమ్

హైదరాబాద్ నగరంలో ఆరు ఎఫ్ఎమ్ ఛానళ్లు నడుస్తున్నాయి. అవి

రేడియో మిర్చి 95 ఎమ్‌హెచ్‌జెడ్
రేడియో బిర్యానీ 98.3 ఎమ్‌హెచ్‌జెడ్
ఎఫ్ఎమ్ రైన్బో 101.9 ఎమ్‌హెచ్‌జెడ్
రేడియో సిటీ 106.4 ఎమ్‌హెచ్‌జెడ్
బిగ్ రేడియో ఎఫ్ఎమ్ 92.7 ఎమ్‌హెచ్‌జెడ్

తాజాగా ఓ ఉర్దూ ఎఫ్ఎమ్ ఛానల్ కూడా ప్రారంభమైంది.

రేడియో మిర్చీ..ఇది చాలా హాట్ గురూ...

95 ఎఫ్ఎమ్ రేడియో మిర్చి స్టేషన్ 2006, ఏప్రిల్ 19న నగరంలో ప్రారంభమైంది. దీన్ని ప్రముఖ నటుడు చిరంజీవి ప్రారంభించారు. ఇది ఇఎన్ఐఎల్‌కు పదో స్టేషన్. ఫేజ్ – 2 కింద నగరంలోని మొదటి ఎఫ్ఎమ్ స్టేషన్‌గా దీన్ని పేర్కొంటారు.

హైలైట్స్

♫ నేషనల్ రీడర్‌షిప్ **2005** సర్వే ప్రకారం... ఇండియాలో 36.7 మిలియన్ల మంది రేడియో మిర్చి వింటున్నట్లు వెల్లడైంది. ఇది అన్ని ప్రయివేటు రేడియో లకంటే ఎక్కువ.

♫ ఇండియన్ లిజనర్‌షిప్ (ఐఎల్‌టి) నిర్వహించిన ఓ సర్వే ప్రకారం... ప్రస్తుతం రేడియో వినే వారు 15–29 మధ్య వయస్కులే ఎక్కువగా ఉన్నారని వెల్లడైంది. వీరిలో సుమారు 70 శాతం మంది రేడియో వింటున్నారు.

♫ మెట్రోపాలిటన్ సిటీస్‌లో 5.9 మిలియన్ల మంది రేడియో మిర్చిని వింటున్నారు. రేడియో అండ్ టెలివిజన్ అడ్వర్టయిజింగ్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చే ఎనిమిది అవార్డులో రేడియో మిర్చీ ఏడు అవార్డులను సొంతం చేసుకుంది.

రేడియో ప్రసారాలకు నూరేళ్లు...

1906 క్రిస్‌మస్ రోజున కెనడా శాస్త్రజ్ఞుడు రిజినాల్డ్ ఫాసెన్‌డెన్ మొదటి సారిగా రేడియో కార్యక్రమాలను ప్రసారం చేశాడు. అట్లాంటిక్ సముద్రంలో అక్కడక్కడ ఉన్న కొన్ని పడవలపై ఏర్పాటు చేసిన వైర్‌లెస్ సెట్లకు తన వయోలిన్ సంగీతాన్ని ప్రసారం చేసి కృతకృత్యుడయ్యాడు. ఈ సంవత్సరం క్రిస్‌మస్‌తో రేడియో ప్రసారాలు శతవార్షికోత్సవాలు జరుపుకోనున్నాయి. ఇలా ప్రారంభమైన రేడియో ప్రసారాలు దినదినాభివృద్ధి చెంది నేడు అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ సౌండ్‌తో ప్రసారాలు సాగిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అన్ని కుగ్రామాలకూ విస్తరించాయి. ఎఫ్ఎమ్‌గా కొత్త అవతారమెత్తి మరింత మంది శ్రోతల దరికి చేరాయి. ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో బ్రాడ్‌కాస్టింగ్ కాస్తా పాడ్‌కాస్టింగ్‌గా మారాయి. ప్రత్యేకంగా తయారు చేసిన ఐపాడ్‌ల ద్వారా శ్రోతలు తమకిష్టమైన పాటలను వినవచ్చు. వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రసారాలు వినేవారి అదుపులోనే ఉంటాయి. ఇంతటితో ఆగకుండా రేడియో ప్రసారాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇంటర్‌నెట్ రేడియోగా, విజ్యువల్ రేడియోగా రూపాంతరం చెందుతున్నాయి. ★

ప్రసార పదనిసలు



1897 – కెఎఫ్ బ్రౌన్ కాథోడ్ కిరణాలను కనుకొన్నాడు.
1906 – రిజినాల్డ్ ఫెసెండెన్ వైర్‌లెస్ టెలిఫోనీ కనుగొన్నాడు. ఈ టెలిఫోనీ ద్వారా సమీప దూరం వరకు రేడియో తరంగాలను ప్రసారం చేశాడు.
1912 – 360 మీటర్ల వేవ్‌లెంత్‌తో ప్రసారాలు ప్రారంభమయ్యాయి.
1920 – ఫస్ట్ కమర్షియల్ రేడియో బ్రాడ్ కాస్ట్
1922 – 400 మీటర్ల వేవ్‌లెంత్‌తో ప్రసారాలు ప్రారంభం.
1923 – ఎసి నిల్‌సెన్ కంపెనీ ప్రకటన కర్తల కోసం రేడియో శ్రోతలను లెక్కించడం మొదలెట్టింది.
1926 – జనరల్ ఎలక్ట్రిక్, వాషింగ్‌హౌస్ రెండు జాతీయ రేడియో ప్రసార కేంద్రాల(ఎన్‌బిసి)ను నెలకొల్పారు.
1933 – ఎడ్విన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్(ఎఫ్ఎమ్) పరిచయం చేశాడు.
1934 – ప్రసారాలకు సంబంధించిన కమ్యూనికేషన్ యాక్ట్ (1934) రూపొందింది.

బిగ్ రేడియో ఒకడుగు ముందుకు...

రేడియో బిగ్ 92.7 ఎమ్‌హెచ్‌జెడ్ సెప్టెంబర్ 25 నుండి ప్రసారాలను ప్రారంభించింది. పేరులోనే గాక అన్ని అంశాల్లోనూ తమ రేడియో చాలా పెద్దదని బిగ్ ఎఫ్ఎమ్ సిఇఓ తరుణ్ కతియాల్ వెల్లడించారు. 'సునో సునావో లైఫ్ బనావో' నినాదంతో యువత కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వినోదమే కాకుండా ఈ రేడియోతో మరెన్నో ప్రయోజనాలున్నాయని ఆయన చెబుతున్నారు. "ఉదాహరణకు నగరంలో ఆకస్మాత్తుగా ఓ చోట రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందనుకోండి... ఆ సమయంలో బిగ్ ఎఫ్ఎమ్ రేడియో వింటున్న వాళ్లకు పరిస్థితి వెంటనే వివరిస్తారు. దీంతో అటుగా వెళ్లాల్సి ఉన్న వాళ్లు వాయిదా వేసుకోవడమో లేక మరో మార్గం ద్వారా వీలుంటుంది.



చిన్న చిన్న పట్టణాలకూ...

"ఫేజ్ – 2 పాలసీ కింద ప్రభుత్వం జనవరి, 2006లో 90 పట్టణాల్లో 250 ఫ్రీక్వెన్సీలను వేలం వేసింది. ఇందులో మా ఇఎన్ఐఎల్ 25 ఫ్రీక్వెన్సీలను గెలుచుకుంది. ఇప్పటికే మావి ఏడు స్టేషన్లు నడుస్తున్నాయి. ఇప్పుడు అదనంగా 25 సొంతం చేసుకున్నందుకు గర్వపడుతున్నాం. వీటిలో భాగంగానే ఏప్రిల్‌లో బెంగుళూరు, హైదరాబాద్, జైపూర్‌లలో కూడా మా స్టేషన్లు ప్రారంభించాం. ఆయా ప్రాంతాలవారి ఇష్టాయిష్టాలను దృష్టిలో ఉంచుకుని మేం ప్రసారాలు కొనసాగిస్తున్నాం. ఇందుకు మా యూనిట్‌కు అభినందనలు. భవిష్యత్‌లో మరిన్ని చిన్న పట్టణాలకు గూడా రేడియో మిర్చి ప్రసారాలకు అందజేస్తాం"

– ఎపి పరిగి, ఎమ్‌డి, సిఇఓ, ఇఎన్ఐఎల్

పిల్లల్లో విరేచనాలు



డాక్టర్ పి సుదర్శన్ రెడ్డి,
చిన్న పిల్లల వైద్య నిపుణులు,
గాంధీ ఆసుపత్రి, సికింద్రాబాద్.

మూడేళ్లలోపు పిల్లల్లో తరచూ వచ్చే నీళ్ళ విరేచనాలకు రోటా వైరస్ అనే సూక్ష్మక్రిమి, ఇకోలి అనే బ్యాక్టీరియా కారణం. ముఖ్యంగా ఆరునెలలు దాటిన పిల్లలు తరచూ నోట్లో వేళ్లు పెట్టుకోవడం వల్లనూ, వారికిచ్చే ఆహారం, తాగే నీటి విషయంలో శుభ్రత లోపించడం వల్లనూ వారి కడుపులో సూక్ష్మక్రిములు చేరుతాయి. తద్వారా వారికి వాంతులు, నీళ్ళవిరేచనాలు అవుతాయి. తల్లిపాలతో పెరిగే పిల్లలకంటే, సీసాతో పాలుతాగే పిల్లలకు ఈ వ్యాధి ఎక్కువగానూ, తీవ్రంగానూ వస్తుంది. ముఖ్యంగా ఆరునెలలలోపు వయసు పిల్లలకు మరింత ప్రమాదకరమవుతుంది.

సాధారణంగా చిన్నపిల్లల్లో విరేచనాలు 5 నుంచి 7 రోజుల వరకు వుండి తరువాత వాటంతట అవే తగ్గుతాయి. ఈ సమయంలో మందులవల్ల వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుంది. వాటంతటవే తగ్గిపోయే ఈ నీళ్లవిరేచనాలకు ఏ యాంటిబయోటిక్స్ పనిచేయవు. చీము, రక్త విరేచనాల వంటి కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల్లో మాత్రమే యాంటిబయోటిక్స్ అవసరమవుతాయి. అందుకనే డాక్టరుగారు ఏ మందులూ రాసివ్వరు. ఈ సంగతి తెలియక కొందరు యాంటిబయోటిక్స్ ఇవ్వలేదని బాధపడతారు. ఈ విషయంలో కొందరు వైద్యుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. వారు రాసే మందులలో అన్ని రకాల మందులు, యాంటిబయోటిక్స్ ఉంటాయి. కానీ అత్యంత అవసరమైన ఓఆర్ఎస్ ద్రావకం మాత్రం సరిగ్గా వుండదు. నిజానికి విరేచనాలనేవి పేగుల్లో చేరిన వ్యాధి, హానికారక సూక్ష్మక్రిములను బయటికి పంపించే సహజమైన ప్రక్రియ. దీన్ని ఆపడానికి వాడే లోపరమైడ్ వంటి మందులవల్ల పిల్లలకు మరింత హాని జరగొచ్చు. అయితే విరేచనాలతో పాటు సోడియం, పొటాషియం వంటి లవణాలు, నీరు బయటికి వెళ్ళడంవల్ల శరీరంలో బలహీనత కలిగి నోరు ఎండిపోతుంది. మూత్రం తగ్గిపోయి నీరసించిపోతారు. ఈ పరిస్థితి రాకుండా అత్యద్భుత ఔషధమే ఓఆర్ఎస్ ద్రావకం. ఇది మార్కెట్లో ఎలక్ట్రాల్, ఎలక్ట్రోబియాన్, పునరీల్ వంటి పేర్లతో కూడా దొరుకుతుంది. 20వ శతాబ్దంలో వైద్యశాస్త్రంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల్లో అతి ముఖ్యమైనదిగా ఓఆర్ఎస్‌ను పరిగణిస్తారు. దీనిని సరిగ్గా వాడడంవల్ల ఎన్నో లక్షల శిశుమరణాలను ప్రపంచవ్యాప్తంగా అరికట్టగలుగుతున్నారు. పిల్లలున్న ప్రతి ఒక్కరూ దీనిని ఎలా తయారుచేయాలో, ఎలా తాగించాలో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ద్రావకం ఇలా తయారు చేయాలి...

ఓఆర్ఎస్ ద్రవాన్ని ఎలా తయారుచేయాలంటే మొత్తం ప్యాకెట్‌ను కాచి చల్లార్చిన ఒక లీటరు నీళ్ళలో వేసి బాగా కలపాలి. మార్కెట్‌లో 200 మి.లీ. నీళ్ళ (పెద్దగ్లాసుడు)లో కలిపే చిన్నప్యాకెట్లు కూడా దొరుకుతున్నాయి. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా ఇస్తారు.

ఈ ద్రావకాన్ని ఎలా ఇవ్వాలంటే...

చిన్నారికి విరేచనమైన ప్రతిసారీ 50-100 మి.లీ. నీటిని శుభ్రమయిన చెంచాతో తాగిస్తూ ఉండాలి. ఓ.ఆర్.ఎస్ ద్రావకంతోపాటే లవణాలు అధికంగా ఉండే ఇతర ద్రావకాలయిన కొబ్బరినీళ్ళు, చిటికెడు ఉప్పు కలిపి ఉడికించిన పప్పు నీళ్ళు, గంజి తరచుగా ఇస్తుండొచ్చు.

ఏదైనా ద్రవమే కదా అంటూ వివిధ శీతలపానీయాలను కొంతమంది ఇస్తుంటారు. ఇది ఏమాత్రం మంచిదికాదు. దీనివల్ల శరీరంలోని కణజాలం మరింత బలహీనతకు గురై హాని జరగొచ్చు. అలాగే తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి.

నీళ్ళ విరేచనాలపుడు చాలామంది పిల్లలకు ఆహారం పెట్టక పత్యం పెడుతుంటారు. దీనివల్ల పిల్లలు మరింత నీరసించిపోతారు. ఈ సమయంలో పిల్లలకు సులభంగా జీర్ణమయ్యే అన్నం పప్పులు, కూరగాయలు, పళ్ళు, పెరుగు వంటివి మెత్తగా చేసి కొద్దికొద్దిగా పెడుతుండడం చాలా మంచిది. విరేచనాలు తగ్గాక 2-3 వారాల వరకు పిల్లలకు అదనపు ఆహారం ఇవ్వడంవల్ల వ్యాధి సమయంలో తగ్గిన బరువు మళ్ళీ పుంజుకుంటుంది.

నివారణకు సూచనలు...

1. శరీరం, ఇల్లు పరిసరాలు, ఈగల్లేకుండా శుభ్రంగా వుండేలా చూసుకోవాలి.

2. మలవిసర్జన తరువాత శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.

3. శుభ్రతలేని బయటి వస్తువులు తినకూడదు.

4. పిల్లలకు రెండేళ్ళవరకు కాచి చల్లార్చిన నీళ్లే ఇవ్వాలి. ఇది వర్షాకాలంలో తప్పనిసరిగా పాటించాలి.

5. తినే పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టి ఉంచాలి. రెండేళ్ళలోపు పిల్లలకు వాడే చెంచాలు, గిన్నెలు, గ్లాసు వేడినీళ్ళతో శుభ్రంగా కడగాలి.

6. పిల్లలకు సీసాతో పాలు, నీళ్ళు పట్టడం ఏమాత్రం మంచిది కాదు.

7. పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇస్తూ ఆ తరువాత రెండేళ్ల వరకు తల్లిపాలతోపాటు శుభ్రమైన, బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలి. ఇందువల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

★

కథ

తంగెళ్ళపల్లి కనకాచారి

ప్రగతిపథం



"కన్నీళ్ళు ఎంత గొప్పవి. మనసు తెల్సిన వారిముందు భోరున ఏడ్చేస్తేగానీ తేలిగ్గా ఉండదు పావనీ. అహం కోసం ఇన్నాళ్లూ కన్నీళ్ళను ఆపుకున్నాను..."

అది ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆర్ట్స్ కాలేజీ. సంధ్య కోసం ఎదురుచూస్తూ బస్టాప్‌లో నిల్చుంది 'పావని'. ఇంటర్ నుండి ఎం.ఎస్సీ వరకు వాళ్ళిద్దరూ క్లాస్‌మేట్స్. వాళ్ళ ఇళ్లూ పక్కపక్కనే. సంధ్యకు ఎం.ఎస్సీ మొదటిసంవత్సరంలోనే పెళ్ళైంది. ఆమె భర్త ఇంజనీర్. సంధ్యావాళ్లు బాగా ధనవంతులు. పైగా చదువుకుంది. అంత అందగత్తె కాకపోయినా ఆకర్షణీయంగా ఉంటుంది. వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి. గడసరి. మాట పడే మనస్తత్వం కాదు.

తప్పులేనపుడు ఎందుకు ఊరుకోవాలి? అనుకుంటుంది. అసలు పెళ్లంటే ఆమెకు ఇష్టం లేదు. పెళ్లయిన తర్వాత అధికారాలన్నీ ఆయనవే. పెళ్లామంటే భర్త అదుపు ఆజ్ఞల్లో ఉండాలి. అన్నీ ఆంక్షలే... పైగా అత్తమామలు, బాధ్యతలు అందరూ వేయికళ్లతో తనను చూస్తున్నట్లు, వెంటాడుతున్నట్లు భ్రమ. కోపాలు ఎక్కువైతే భార్యాభర్తల 'కీచులాటలు'. ఇవన్నీ తను భరించలేదు. తల్లిదండ్రులు మంచిసంబంధమనీ, అలాంటిది మళ్లీరాదనీ చెబుతూ బలవంతంగా సంధ్యకు పెళ్లిచేశారు. తమ బాధ్యత తీరిపోయిందనుకున్నారు. సంధ్య స్వతంత్రభావాలు తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టాయి. కుటుంబంలో కలతలు మొదలయ్యాయి.

"హలో, పావనీ" అనే పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది పావని. ఎదురుగా సంధ్య.

"బస్ రద్దీగా వుంది. నువ్వు నా కోసం ఎదురుచూస్తూంటావు కదాని ఆటోలో వచ్చేశాను" నవ్వుతూ అంది సంధ్య.

"సరే రా, ఆ లాన్‌లో కూర్చుని మాట్లాడుకుందాం"

"లోపల గుడి వుందిగా, అక్కడ ప్రశాంతంగా వుంటుంది వెళ్దాం" అంది సంధ్య.

"పెళ్లయ్యాక భక్తి పెరిగినట్లుంది" అంది నవ్వుతూ పావని

"అలా అని కాదు కాస్త ఏకాంతం కోసం" అంది సంధ్య

"కమ్యూనిజం, మార్క్సిజం గొప్పవే. కాదనను కానీ భారతీయ వ్యవస్థలో సంస్కృతీ సాంప్రదాయాల్లో వుండే సౌందర్యం, స్ఫూర్తి చాలా గొప్పవి"

"తల్లీ, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలపై సెమినార్ పెడ్తే నువ్వొచ్చి మాట్లాడుదువులే, ఇపుడు మాత్రం క్లాస్ పీకకు" వెటకారంగా అంది సంధ్య.

ఇద్దరూ నవ్వుకున్నారు. నవ్వుతున్న సంధ్యను చూస్తుంటే ఆనందంగా అనిపించింది పావనికి.

"నిజమే, తనివితీరా నవ్వుకోక చాలా రోజులైనట్లుంది కదా" అంది సంధ్య చెమర్చే కళ్ళతో.

"ఏయ్, చిన్నపిల్లలా ఏంటి? ఊరుకో" సముదాయించింది పావని.

"కన్నీళ్ళు ఎంత గొప్పవి. మనసు తెల్సిన వారిముందు భోరున ఏడ్చేస్తేగానీ తేలిగ్గా ఉండదు పావనీ... అహంకోసం ఇన్నాళ్లూ కన్నీళ్ళను ఆపుకున్నాను"

ఇద్దరూ కాసేపు మౌనంగా వున్నారు.

"నాకు కంప్యూటర్స్ వచ్చు. ఏదో ఉద్యోగం చూసుకుంటాను. ఇంట్లో ఏమీ తోచట్లేదు. ఒంటరిగా వుంటే ఏవో ఆలోచనలు వస్తుంటాయి"

"మరి భర్త?"

"ఈ బంధాన్ని భరించే ఓపిక నాకు లేదు. అమ్మనాన్న దగ్గరే వుంటా"

"అసలు గొడవ ఏమిటి?"

"ప్రత్యేకంగా చెప్పేదేం లేదు. నాకూ, ఆయనకు పడదు. అంతే! ప్రతిదానికీ తన మాటే గెలవాలంటాడు. తన వాళ్లే గొప్పంటాడు. చీటికీమాటికీ విసుక్కుంటాడు. మూర్ఖంగా ప్రవర్తిస్తాడు. చేసేది తప్పని తెలిసినా అదే సరైందంటాడు. తనవాళ్లు.. తనవాళ్లు అంటూ వారికే ఎప్పుడూ ప్రాముఖ్యతనిస్తుంటాడు. నా మాటకు విలువివ్వడు. పెళ్లంటే ఇష్టం లేదు. అమ్మానాన్నా ఇద్దరూ నన్ను బలవంతంగా వప్పించారు. ఇప్పుడు వాళ్ళని ఏమనగలను? వారి మాటను నేను కాదనలేను. అప్పుడే గట్టిగా వాదించి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు"

"ఇపుడు బాధపడ్తే ఎలానే? సర్దుకుపో...! నూరేళ్లు కల్సివుండాలనుకున్నపుడు, నీకు తను, తనకు నువ్వు. మీరిద్దరే చివరిదాకా వుండాల్సిన వాళ్ళు. మూడో మనిషికి ఎందుకు తావిస్తారు? ఇద్దరూ కూర్చుని మాట్లాడుకోండి. సమస్య ఏదైనా వుంటే పరిష్కరించుకోండి"

"వ్యక్తిత్వ వికాస పాఠాలు చెబుతున్నావా? అవి వినడానికే బాగుంటాయి. ఆచరణలో భిన్నంగా వుంటాయి. ఎదుటివాడు ఏమి ఆలోచిస్తున్నాడో తెలిశాక దాని ప్రకారం వ్యూహం మార్చుకోవాలి. అంతేగానీ సిద్ధాంత ప్రాతిపదికపై ఎలా వెళ్లేది?"

"ఐతే ఏం చేస్తానంటావు?"

"విడాకులివ్వనుగానీ విడిగా వుంటా. అతనింకో పెళ్లి చేసుకోవాలనుకుంటే నేనేం అడ్డు చెప్పను. అతనిష్టం అతనిది. నేనైతే మరో పెళ్లి చేసుకోను. ఇంకా చదివి, ఏదైనా ఉద్యోగం

చూసుకుంటాను. అమ్మానాన్నలపై ఆధారపడను. నా సంపాదనతోనే బతుకుతా"

"అతను మారడు, నేనూ మారను. కనుక మేం కలవడం కల్ల"

"మరి వంటరితనాన్ని ఎలా భరిస్తావ్? చిన్నపుడు అమ్మానాన్న వెంట రాకపోతే నే ఫీలయ్యేదానివి. కాలేజీకీ వంటరిగా వచ్చేదానివి కాదు. మాటల్లోనే అంతా గడుసుదనం కానీ చేసేపనిలో లేదే. ఎలా నిన్ను అర్థం చేసుకోవాలి?"

"స్నేహాన్ని వీడి వుండలేను. ఎందుకో వంటరితనంగా అన్పిస్తుంది. భయం వేస్తోంది. తోడులేని బతుకు కష్టమే. ప్రేమ లేకుండా మనిషి బతకడం అసాధ్యం"

"ఏంటే వేదాంతిలా మాట్లాడతావు? పెళ్లయి సంవత్సరం అయిందో, లేదో నూరేళ్ల కాపురం చేసినట్లు మాటలెందుకు? మీరిద్దరూ బావుంటారు, మంచి రోజులొస్తాయి.. బాధపడకు"

"నాకు రెండే దారులు కన్పిస్తున్నాయి. ఒకటి స్వతంత్రంగా బతకడం. రెండోది అవమానాలు భరిస్తూ ఆ నాల్గుగోడల మధ్య దొర్లడం"

''అందరూ తెలివితక్కువై కల్సివుంటున్నారని అనుకుంటున్నావా?"

"కానీ అలా ఎందుకు కల్సి వుండాలి? విడిపోతే 'ఈ సంఘర్షణ వుండదుగా"

"నీ జీవితం నీ ఇష్టం. నిర్ణయం నీదే. స్నేహితురాలుగా నేను కోరేది నువ్వు సుఖంగా వుండాలనే"

"నేను రాజీపడలేను" అంటూ లేచింది సంధ్య.

"ఆలోచించు.... హడావుడిగా నిర్ణయాలు తీసుకోవద్దు. ప్రత్యామ్నాయాలు ఉన్నాయని పరుగులొద్దు. జీవితమంటే ఆషామాషీ వ్యవహారంకాదు. నిర్లక్ష్యం చేస్తే అది ఊరుకోదు. కసి తీర్చుకుని తీరుతుంది. ఏది మంచిగా అన్పిస్తే అది చేయి. ఇలా నిర్ణయం తీసుకున్నానే అని ముందే ఆలోచించి అడుగువేస్తే భయం వుండదు. కనుక ఆలోచించుకో. ఎన్నిసార్లైనా ఫర్వాలేదు. చర్చించుకుందాం. సరేనా? తార్నాకలో మంచి హోటల్‌వుంది టిఫిన్ చేసి వెళ్దాం!" అంది పావని.

◆ ◆ ◆

రెండేళ్లు గడిచాయి. పావని పెళ్లిచేసుకుంది. ఇద్దరూ ఒకే కాలేజీలో లెక్చరర్స్. సంధ్య జీవితంలో పెనుమార్పులు సంభవించాయి. ఆమె తండ్రి కారు యాక్సిడెంటులో ప్రాణాలు కోల్పోయాడు. సంధ్య ఓ ప్రైవేట్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరింది. భర్త చేస్తున్న ఉద్యోగం మానేసి బిజినెస్ మొదలు పెట్టాడు. దాన్లో నష్టం వచ్చింది. చాలా అప్పులు చేశాడు. మళ్లీ ఉద్యోగంలో చేరాడు. వీరి జీవితంలోకి ఓ 'బాబు' పుట్టుకొచ్చాడు. మారిన పరిస్థితుల దృష్ట్యా బతుకు పోరాటంతోనే సరిపోయింది సంధ్యకు. పరస్పరం 'అహాలు' ప్రదర్శించుకునే సమయందొరకలేదు. బాబు పుట్టడంతో చాలావరకు గొడవలు తగ్గాయి. అప్పుడప్పుడు ఆగ్రహం కెరటాలు లేస్తున్నా సర్దుకుపోతున్నాయి. భర్త, అమ్మ, బాబు, ఉద్యోగాలు నరిపోతున్నాయి. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటోంది సంధ్య.

ఒకరోజు...

"సంధ్యా! చేసిన అప్పులు తీరాలంటే వస్తోన్న జీతం సరిపోవడం లేదు. మీ అమ్మావాళ్ళ దగ్గర డబ్బు తీసుకుని మళ్లీ వ్యాపారం చేసే?!" అన్నాడు సంధ్య భర్త కొత్త ఉపాయం తట్టినట్లు.

"అమ్మావాళ్ళ డబ్బు వాడటం నా కిష్టంలేదు. మన అప్పులు మనవి. అంతేగానీ అమ్మావాళ్ల డబ్బు వాడాలనే ఆలోచన మనకొద్దు" ఖచ్చితంగా తేల్చి చెప్పింది సంధ్య.

"అది కాదే! అవసరాలు పెరుగుతున్నాయి. దాంతో వడ్డీలు పెరుగుతున్నాయి"

"ఎవరు చేయమన్నారు అప్పులు. కావాలంటే మీ నాన్న దగ్గరో, మీ కుటుంబసభ్యుల దగ్గరో తెచ్చుకోండి"

అంతలో ఆడుకుంటున్న 'బాబు' పరుగెత్తుకుంటూ వచ్చాడు వాళ్ళ దగ్గరకు. ఎత్తుకోమని తండ్రి దగ్గరకు చేరాడు. అతను బాబును ఎత్తుకున్నాడు.

"ఆకలి అవుతుందేమో బాబుకి" అన్నాడు.

"సరే! ఇటివ్వండి" అని బాబుని తీసుకుని పాలివ్వడం మొదలు పెట్టింది.

తిరిగి సంధ్యనే సంభాషణ మొదలు పెడ్తూ "ఏది ఏమైనా కుదర్దండీ. కావాలంటే ఇద్దరం అదనంగా కష్టపడదాం. మరొక పార్ట్‌టైం జాబ్ చూసుకుందాం" అంది.

"సరే! బాగానేవుంది గానీ, మీ అమ్మగారు వింటున్నట్టున్నారు. కాస్త నెమ్మదిగా మాట్లాడు. ఇక ఈ గొడవ ఇంతటితో ఆపేద్దామా?"

◆ ◆ ◆

"నాకెవరున్నారే! మీరేగా, ఈ ఆస్తి నేనేమైనా మూట కట్టుకుపోతానా? అల్లుడుగారు అప్పులు, వ్యాపారం అంటున్నాడుగా, వ్యాపారం మాట అటుంచి అప్పులెంతయ్యాయో అడుగు. డబ్బు డ్రా చేద్దాం. మీకు వీలున్నపుడు మళ్లీ సర్దండి" సంధ్యకు వాళ్ళ అమ్మ సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తోంది.

"అమ్మా, మా కష్టంతోనే అప్పులు తీర్చుకుంటాం, నీకు ఇబ్బంది వద్దు"

"అది కాదే, మీరు సుఖంగా వుంటేనేగా, నేను సుఖంగా వుండేది"

"వద్దని చెప్పానా, ఇక విసిగించకు" అంది కోపంగా.

"పావని వస్తానంది ఈరోజు. ఈ కాలనీలో ఎవరో బంధువులున్నారట. అక్కడి పనైపోయాక మనింటికి వస్తానని చెప్పింది"

"అది చెప్తేగాని, నువ్వు వినవులే'' అందావిడ. అలా వాళ్ళు మాట్లాడుకుంటూ వుండగా కాలింగ్ బెల్ మోగింది.

"హాయ్ సంధ్యా!" అంటూ అమాంతంగా వచ్చి సంధ్యని కౌగిలించుకుంది పావని.

సంధ్య తల్లికి నమస్కరించి "బావున్నారా?" అంది.

"బావున్నాం గానీ, ఎలా వుందీ కొత్త సంసారం?" అడిగింది సంధ్య.

"బావుంది" అంది నవ్వుతూ సంధ్య చంకలోని బాబును తీసుకుని ముద్దాడింది పావని.

"రెండు ధృవాలను కలిపిన వరపుత్రుడు" అంది నవ్వుతూ. అక్కడ నవ్వులు విరిసాయి.

"సంధ్యా, నేనొక కొత్త ప్రాజెక్టు తెచ్చాను. అందరం కల్సి వ్యాపారం చేయాలని" అంది పావని.

"ఆయనగారి వ్యాపారం గొడవతోనే చస్తుంటే. మరొక కొత్త ప్రాజెక్టు తెచ్చావా తల్లీ!" అంది సంధ్య.

"ఈ ఏరియాలో మంచి స్కూల్ లేదుగా. మనం ఓ స్కూల్ పెడదాం"

"అమ్మా తల్లీ! ఇక ఆపు!! మమ్మల్ని ఉద్యోగాలు చేసుకోనిస్తారా?! అందరూ కట్టకట్టుకుని బిజినెస్... బిజినెస్ అంటారే" విసుక్కుంది సంధ్య.

"అమ్మతో ఓ లేడీస్ ఎంపోరియం మొదలు పెట్టిస్తా. నేను, మా ఆయన కొన్ని సంవత్సరాల దాకా ఉద్యోగం చేస్తాం. తీరిక వేళలో అమ్మ షాపు చూసుకుంటారు" కొత్త ఆలోచన చెప్పింది సంధ్య.

"చూసుకోండి... వద్దనడంలేదు. మీకు తీరిక ఉన్న టైంలో మాతో కలిసి రావాలని నేను అభ్యర్థిస్తున్నా. ఎందుకంటే మన రెండు జంటలు కలిస్తే అద్భుతాలు తప్పక సృష్టించగలం అని నా నమ్మకం అంది పావని.

"సరే" అంది సంధ్య.

◆ ◆ ◆

కాలచక్రం తిరుగుతూనే వుంది. సంధ్య ప్రాజెక్టు ఫలించింది. పావని ఆశా తీరింది.

ఆర్థిక ఇబ్బందులు తీరిపోయాయి. ఇతరత్రా ఏమైనా బేధాభిప్రాయాలు తలెత్తితే కలిసి చర్చించుకుంటారు. సామరస్యంగా మాట్లాడుకుంటారు. పరస్పరం అర్థం చేసుకున్నాక ఇక 'అహం' సమస్యేముంది?! ఇప్పుడు సంధ్య సంసారం ప్రగతి పథాన పయనిస్తోంది.

☆

ఆడియో, వీడియో

"కొత్త కాలనీలో మీరు కట్టుకున్న ఇండిపెండెంట్ హౌస్ ఎలా వుందేం?" అని ఆరాతీసింది పాత పక్కింటావిడ.

''అపార్ట్‌మెంట్స్‌లో వుండగా టీవీ చూడ్డం బోర్ కొట్టినపుడు ఏ గోడకి చెవి ఆనించినా ఆడియోకి లోటుండేది కాదు. ఇపుడు మేమున్న చోట ఆడియో, వీడియో రెండూ కరువే. మనిషి కనపడాలంటే మైలు దూరం నడవాల్సిందే" చెప్పింది బాధగా నిట్టూరుస్తూ.

- శ్రీకృష్ణ వరప్రసాద్

విశిష్టవ్యక్తి

డా.జె.పి. వైద్య

లత గీతాలే అసలైన వజ్రాలు

ప్రతిరోజూ ఎక్కడో అన్యాయం, మరెక్కడో అత్యాచారం, ఒకచోట ధర్నా, మరోచోట లాఠీఛార్జి, ఓ మూల బంద్, మరో మూల ఫైరింగ్ చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి వాతావరణంలో మామూలు మనిషి మనసుకు 'సుకూనియత్' అందించేదేదైనా వుందంటే అది నిస్సందేహంగా సంగీతమే.

"అయ్యా! మీ రోగాల చిట్టా విప్పకండి. నేను బేజారై పరేషాన్ అవుతున్నా. ఈ మాత్రలూ, టానిక్కులూ మింగకపోయినా రాత్రి పడుకునే ముందు లతామంగేష్కర్ పాటలు వినండి. మీ జబ్బు నయమైపోతోంది....' అని కొందరు డాక్టర్లు తమ 'మొండి పేషంట్ల'కు సూచిస్తారట. అదీ ఆవిడ గానమహిమ. భారతీయ సినీ సంగీత ప్రపంచంలో లతా మంగేష్కర్ నిస్సందేహంగా 'ది ఫస్ట్ సిటిజన్'! జీవితకాలంలో మనం పీల్చే సంగీతపు గాలిలోని 'ఆక్సిజన్' ఆమె! ఈ 'ప్రాణ వాయువు'ఇంకా సంగీతాభిమానులకు స్వచ్ఛమైన నిఖార్సైన జీవితాన్ని అందిస్తూనే ఉంది.

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో... ఒక బక్క పలుచని, రెండు జడల అమ్మాయి, చంకలో పాపనూ, చేతిలో పిల్లవాడినీ వెంటేసుకుని అచంచలమైన ఆత్మవిశ్వాసంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో మొదటిసారిగా అడుగు పెట్టింది. అప్పుడా అమ్మాయి చంకలోనూ, పక్కనున్న పిల్లలే నేడు హిందీ, మరాఠీ సినీ సంగీత ప్రపంచంలో తమదంటూ ప్రత్యేకమైన బాణి పలికించిన ఆశా భోంస్లే, మీనా, ఉషా, హృదయనాథ్ మంగేష్కర్‌లు. ఆ రెండు జడల అమ్మాయే యావత్ ప్రపంచానికి అందించిన 'భారతీయ సంగీతపు అంబాసిడర్' లతా మంగేష్కర్.

లతా గానం చేసిన మొదటి గీతం గురించిన కథ చూడండి! మాస్టర్ గులామ్ హైదర్ 'మాలాడ్' రైల్వే స్టేషన్‌లో ఓ మూల చతికిలపడి, సిగరెట్టు పెట్టె మీద వేళ్లతో 'టకటక'లు కొనసాగిస్తున్నాడు. కాసేపటికి ఒక ధున్ తయారైంది. 'దిల్ మేరా తోడా...ముఝే కహీం కా న ఛోడా, తెరే ప్యార్ నే....' అన్న గీతం. 'బొంబే టాకీస్' వారి 'మజ్‌బూర్' చిత్రంకోసం లతా గానం చేసిన మొట్టమొదటి పాట అది. "ఇదే గొంతండీ బాబూ? మరీ ఇంత సన్నగా జీరలా ఉందేంటీ? సినిమాలకు అస్సలు పనికిరాదు అని ఆమె గాత్రాన్ని ఈసడించినవాళ్లే తర్వాతి కాలంలో ఆ గొంతు కోసమే ఆమె గుమ్మంముందు గంటలు కాదు... దినాలు... వారాల కొద్దీ తారట్లాడారు. 'పికోలో' తరహా గొంతు ఆమెది. మైకును సైతం తన చెప్పుచేతల్లో పెట్టుకునే అసమాన శక్తి సామర్థ్యాలు, స్థాయి ఉన్న గాత్రం ఆమె సొంతం.

'బర్సాత్'తో జడివాన కురిపించి, సంగీతం వరదలు పారించేసరికి, యావత్ భారతదేశంలో సంగీత ప్రియులు చెవులు రిక్కించి, లేచి కూర్చున్నారు. అద్భుతం... లా జవాబ్, ఆశ్చర్యం... అంటూ నోరెళ్లపెట్టారు. అనతికాలంలో లతా గానామృతం సంగీతాభిమానులకు 'మజేదార్ దావత్' అయిపోయింది.

ఆ రోజుల్లో హిందీ సంగీత సామ్రాజ్యంలో ఎలాంటి హేమాహేమీలున్నారనీ? నూర్జహాన్, షమ్షాద్ బేగం, జొహ్రా, రాజకుమారి, మోహన్ తారా, నిర్మలాదేవి, లలితా దేవుళ్‌కర్, బీనాపానీ ముఖర్జీ, గీతా దత్, సురయ్యా... ఎవరి ప్రత్యేకత వారిదే. నూర్జహాన్‌కు తమలపాకులంటే ఇష్టం. మన లతాకు చూయింగ్ గమ్ అంటే ప్రాణం. చ్యూయింగ్ గమ్ నములుతూనే, మెల్లమెల్లగా తన అసాధారణ గాన పటిమతో హిందీ సినీ సంగీత ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకుంది. వీనుల విందుచేసే ఆ పాటలను మనం బాత్‌రూంలోనైనా 'గున్ గునాయించకుండా' ఉండలేం కదా? దాదాపు అన్ని భారతీయ భాషల్లోనూ 25000కు పైగా గీతాలు గానం చేసి గిన్నీస్ రికార్డ్ సాధించింది. (లతా ఎక్కువ పాటలు పాడిందా, రఫీ ఎక్కువ పాటలు పాడాడా- అన్న వాదం కొన్నాళ్లు సాగింది. ఆ విషయం ఇక్కడ అప్రస్తుతంలెండి)

శంకర్ జైకిషన్‌లకు 'భైరవీగానం' చాలా ఇష్టం. జైకిషన్ అయితే

(లతా మంగేష్కర్ పుట్టినరోజు (28 సెప్టెంబర్ 1929) సందర్భంగా)

ఏకంగా తన కూతురికి భైరవి అని పేరు పెట్టుకున్నాడు. భైరవి ఎప్పటికీ సదా సుహాగన్ రాగం! అంటే నిత్య సుమంగళీ భవ అన్నట్టు! లత ఆలపించిన భైరవీ రాగంలోని కొన్ని గీతాలను తల్చుకుందాం. కొండాకోనల్లోని తరుణి కోసం జైకిషన్ 'బర్సాత్‌'లో రూపుదిద్దిన సదాబహార్ గీతం 'బర్సాత్ మేఁ హమ్ సే మిలేఁ తుమ్ సజన్‌దో... (గంగా జమునా...నౌషాద్), 'జోతుమ్ తోడో పియాఁ' (ఝనక్‌ఝనక్ పాయల్ బాజే – వసంత్‌దేశాయ్), 'సాంవరేఁ – సాంవరేఁ' (అనురాధా–రవిశంకర్), 'మేరే ఆంఖోమేఁ బస్ గయాహోయిరే' (బర్సాత్ – శంకర్‌జైకిషన్), 'బహారోఁ! మేరా జీవన్ భీ సవారో' (ఆఖరీఖత్– ఖయ్యామ్) లాంటి కమనీయగాతాలు అసంఖ్యాకం. పోతే తెలుగులో 'నిదుర పోరా తమ్ముడా' అంటూ పాడిన అదే గాత్రం చాలా రోజుల తర్వాత 'తెల్ల చీరకు తకదిమి తపనలు' అంటూ ఏమాత్రం మాధుర్యం తగ్గకుండా పాడింది.

దాదాపు అన్ని భారతీయ భాషల్లో తన గాన మాధురిని నింపిన లతా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 1929 సెప్టెంబర్ 28న జన్మించింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రతిఏటా 'లతా మంగేష్కర్ పురస్కార్'ను(లక్ష రూపాయలు) ఉత్తమ సంగీతకళాకారుల కందిస్తుంది. తనదంటూ ప్రత్యేకతను సాధించుకున్న మరో సంగీత మేధావి ఓపి.నయ్యర్ మటుకు లతతో ఒక్క పాట కూడా పాడించలేదు. ఆయన సంగీతం నిండా లత చెల్లెలు ఆశాభోంస్లే వ్యాపించి న భూతో న భవిష్యత్‌గా కీర్తి సంపాదించుకుంది. ఓ ఏడాది 'లతా మంగేష్కర్ పురస్కార్' లతతో పాటలు పాడించని ఓపి.నయ్యర్‌ను వరించింది. కాని ఆయన తీసుకోలేదు. సున్నితంగా తిరస్కరించారు. 'ఆనంద్ ఘన్' పేరుతో ఆమె తన మాతృభాష మరాఠీలో 'మోహిత్యాచీ మంజులా' మొదలైన చిత్రాలకు సంగీతం సమకూర్చారు. 1988లో 'లేకిన్' అనే హిందీ చిత్రాన్ని నిర్మించారు. నాలుగు సార్లు 'ఫిల్మ్‌ఫేర్' అవార్డులు పొందాక 'ఇక చాలు..! కొత్త కళాకారుల కివ్వండి' అని గౌరవంగా తప్పుకున్నారావిడ. పద్మభూషణ్(1969), దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం(1989) 'భారత్‌రత్న' లాంటి పురస్కారాలు ఆమెకు కాదు పురస్కారాలకే వన్నె తెచ్చాయంటే అతిశయోక్తి కాదు.

కవి ప్రదీప్ రాసిన అజరామర గీతం 'యే మేరే వతన్‌కే లోగో' (సి.రాంచంద్ర సంగీతం) పాట విన్న భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ కదిలిపోయి..."నన్నేడిపించావ్" అంటూ ఆత్మీయంగా లతను అక్కున చేర్చుకున్నారు.

ఆమె ఉస్తాదోంకే ఉస్తాద్, ఉస్తాద్ బడే గులామ్ అలీఖాన్ "లత సంగీతం గురించి నేనేం చెప్పగలను? అది స్వర్గం నుండి నేరుగా నేలపై జాలువారిన అమర సంగీతం" అన్నారు. "లత గాత్రం...సాక్షాత్ సరస్వతీ వరదానం" అన్నారు ఉస్తాద్ అమ్జద్ అలీఖాన్. "లత గానం విన్నప్పుడల్లా అనాలోచితంగా కళ్లు చెమర్చిపోతాయి" అన్నారు ఉస్తాద్ సలామత్ అలీఖాన్. "ఇంకా వచ్చే వెయ్యేళ్లల్లోనూ మరో లత జన్మించదు" అన్నారు ఉస్తాద్ అల్లారఖాఁ. "లత గాత్రం దేవుడి వరం" అన్నారు దిలీప్‌కుమార్. "లత గొంతు అమృతం" అన్నారు శివాజీ గణేషన్. భారతీయ హిందీ సినీరంగ 'చార్లీచాప్లిన్', 'ది గ్రేటెస్ట్ షోమాన్ ఆఫ్ ఇండియన్ సినిమా' రాజ్‌కపూర్ 'లత స్వరాలు లేని సినీ సంగీతాన్ని ఊహించలేం" అన్నారు. "లత – ఎత్తైన చిటారు కొమ్మ మీది స్వరకోకిల"–డా. పద్మాసుబ్రహ్మణ్యం. కొందరు ప్రముఖులు లతా మంగేష్కర్ గురించి ఇలా చెప్పారు.

బ్లాక్ అండ్ వైట్

బార్బర్ సంపాదన పెంచుకునే ఆరాటంకొద్దీ "ఎప్పుడూ ఒట్టి క్రాఫింగేనాండీ? ఈసారినుంచీ జుట్టుకు డై కూడా చేయించు కోకూడదూ?" అన్నాడు గోవిందంతో.

"వద్దోయ్. మా ఆవిడ జుట్టూ నెరిసిపోయింది. కలర్ సినిమాలకే విలువిచ్చే ఈ కాలంలో బ్లాక్ అండ్ వైట్ భార్యాభర్తలని పిలిపించుకోవడం నాకిష్టంలేదు" అన్నాడు గోవిందం.

– శ్రీకృష్ణ వరప్రసాద్

కొల్హాపూరీ మటన్, ఫ్రై ఫిష్ ఆమెకు ప్రీతికరమైన వంటకాలు. అలనాటి అందాల తారలు మీనాకుమారి, నర్గిస్ లాగే లతకు తెల్ల రంగు ఇష్టం. ముంబయి అంటే ఆమెకు చాలా ఇష్టం. ఆమె నివాసం 'ప్రభుకుంజ్' లో ప్రతీ ఏటా దీపావళి ఘనంగా జరుపుకుంటారు. క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్ అంటే అభిమానం. ఫొటోగ్రఫీ ఆవిడ హాబీ. ఆమెకు రత్నాలు, వజ్రాలూ అంటే మక్కువ. ఇవేవీ అందుబాటులో లేని మామూలు మనుషులకు లత గీతాలే రత్నాలూ, వజ్రాలూనూ. శైలేంద్ర, కైఫీ ఆజ్మీ, సాహిర్ లుధ్యానవీ, మజరూహ్ సుల్తాన్‌పురి, హస్రత్ జయ్‌పురి, నరేంద్రశర్మ, ప్రదీప్, నీరజ్– లే కాకుండా ఎందరెందరో రాసుకున్న అక్షరాలకు, లత స్వరాలు బంగారపు తొడుగులు తొడిగాయి.

ఎప్పుడో 'అల్లా తేరేనామ్...' అని శాంతంగా భజనలూ, 'మై క్యా కరూఁ రామ్ ముఝే బుడ్డా మిల్‌గయా..' అని ఆట పట్టించే కవ్వింపు గీతాలూ, 'దీదీ తేరా దేవర్ దివానా..' అని వేళాకోళంచేసే సరదా గీతాలు.. ఏవి పాడినా – ఆమె స్వరమాధుర్యంలో నేటి వాస్తవికతను ప్రస్ఫుటంగా ఎత్తి చూపుతున్నాయన్నది ఒప్పుకోక తప్పదు.

'ఔరత్ నే జనమ్ దియా మర్దోంకో / మర్దోనేఁ ఉసే బాజార్ దియా / జబ్ జీ చాహా మసలా కుచ్‌లా / జబ్ జీ చాహా దుత్కార్ దియా'

ప్రస్తుతం ఎక్కువగా లండన్‌లో ఉండి 'జ్యూవెలరీ డిజైనింగ్' లో ఆసక్తి కనపరుస్తున్నారు లత. అయితే సంగీతాభిమానులకు మట్టుకు లత అందించిన గీతాలే నిజమైన 'జ్యూవెలరీ'.

★





మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141
హిప్నో కమలాకర్

చదువుకుందామని పుస్తకం తెరిచినపుడల్లా దృష్టి ఎటో పోతోంది. కూర్చునే స్థలాన్ని మార్చితే ఫలితముంటుందేమో అనిపించింది. కాస్సేపు డాబామీద, కాసేపు డైనింగ్ హాల్ దగ్గర కూర్చున్నాను. ఎంత ప్రయత్నించినా చదువు బుర్రకు ఎక్కడం లేదు. బలవంతంగా ఒక అరగంట చదివాను. వెంటనే తలనొప్పి మొదలయింది. ప్రతిసారీ ఇలాగే అవుతోంది. నాకేం చేయాలో అర్థం కావటం లేదు. పైగా పరీక్షలు దగ్గర పడుతున్నాయి.

–గోపి, గరగపర్రు

ఈ సమస్య విద్యార్థుల్లో సామాన్యంగా కన్పిస్తుంటుంది. దీనితోనే నువ్వూ బాధపడుతున్నావు. ఈ సమస్యనుంచి బయటపడడానికి నీవు చేస్తున్న పనులు సరైనవి కావు. పుస్తకం తెరవగానే దృష్టి మారిపోవటం అంటే, ఏకాగ్రతాలోపం. అదే పనిగా ఒకే అంశంపై దృష్టిని కేంద్రీకరించడాన్ని మనం ఏకాగ్రతగా నిర్వచిస్తాం. అసలు ఏ అంశం మీద కాసేపు ఏకాగ్రత పెట్టినా వెంటనే మెదడులో సంబంధిత ఆల్ఫా తరంగాలు ఉత్పన్నమవుతాయి. మనసు ప్రశాంతంగా మారి నిద్రాస్థితివైపుకి వెళుతుంది. ఆ సమయంలో మెదడును చురుగ్గా వుంచే వ్యవధిని అటెన్షన్ స్పాన్ అంటారు. ఇది ఎక్కువమంది పిల్లల్లో అతి తక్కువగా వుండటం వల్ల వారిలో చికాకు, అశాంతి, భయాందోళనలకు అవకాశం ఏర్పడుతుంది. ఏకాగ్రతను పెంచుకోవాలంటే అది ఒక్కరోజులో సాధ్యం కాదు. మీ మనసును క్రమంగా ఏకాగ్రతకు అలవాటు చేయాలి. ఆ తర్వాత దాన్ని పెంచుకోవలసి వుంటుంది. ప్లేస్ మారిస్తే చదువెక్కుతుందోమోనని మీరు చేస్తున్న పని సరైనది కాదు. మొదట మైండ్‌ను సంసిద్ధంగా వుంచుకోండి. నిర్ధిష్ట ప్రదేశం వద్ద చదువును కొనసాగిస్తూ వుండాలి. ఆ ప్రదేశాన్ని మీ ఇంట్లోనే ఎంపిక చేసుకుని ప్రాక్టీసు చేయండి. ఏకధాటిగా చదివితే తలనొప్పి వస్తోందన్నారు. దీనివల్ల మరో ఇబ్బందీ వుంది. మీరు ముందు చదివిందాన్ని, చివర్న చదివిందాన్ని మాత్రమే గుర్తుంచుకోగల్గుతారు. మధ్యలో చదివిందంతా ఆవిరైపోతుంది. అంచేత, ఇరవై నిముషాల పాటు దీక్షగా చదవండి. పదినిముషాలు తర్వాత మళ్ళీ చదువు మొదలు పెట్టండి. దీన్నే బి.ఇ.ఎమ్. టెక్నిక్ అంటారు. మీ ఏకాగ్రత సమస్య పరిష్కారాన్ని పరీక్షలు అయిపోయిం తర్వాత చూద్దాం. ప్రస్తుత పరీక్షలకు మాత్రం మీరు ఈ విధంగా ప్రిపేర్ కండి.కండి

నేను పదో క్లాసు చదువుకుంటున్నాను. కోర్సుచాలా ఎక్కువగాఉంది. అయితే దానికి తగిన విధంగానే టైంప్లానింగ్ చేసుకున్నాను. నాకున్న సమస్య ఏకధాటిగా చదవడం. చదివిన దాన్ని రాయాలంటే బోరు కొడుతోంది. రాయటం అంటే నాకు మహా చిరాకు. స్కూల్లోగానీ, ఇంట్లోగానీ, చదివిన దాన్ని రాయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. దాని వల్ల ప్రయోజనముంటుందని నాకు అనిపించటం లేదు. ఏదైనా పాఠ్యాంశం ఎన్ని సార్లు చదివినా బుర్రకు ఎక్కకపోతే, మా స్నేహితులను గట్టిగా చదవమంటాను. దాన్ని నేను ఏకాగ్రతగా వింటాను. ఇలా చేస్తే నాకు ఎక్కువగా గుర్తుంటుంది. మావాళ్లు స్నేహితులతో కలిసి చదువుకోవద్దంటారు. కబుర్లాడతాననీ, చదువు అశ్రద్ధ చేస్తాననీ వారి బెంగ. నేనెలా చదువుకోవాలో తగిన సలహాల్వివ్వండి.

– కుమార్, వరంగల్.

పిల్లల్లో చదువుకునే విధానాలు వేర్వేరుగా వుంటాయి. కొంతమంది చూస్తే ఇట్టేపట్టేస్తారు. మరికొంతమంది వింటేగానీ, అర్థం చేసుకోలేరు. ఇంకొంతమంది విషయాన్ని అనుభూతి చెందితే తప్ప గుర్తుంచుకోలేరు. వీళ్లని వరుసగా విజ్యువల్, ఆడిటరీ, కైనస్థటిక్ లెర్నర్స్ అని అంటారు. మీరు చెప్పిందాన్ని బట్టి మీరు ఆడిటరీ లెర్నర్ అని అన్పిస్తుంది. ఆడిటరీ లెర్నర్స్‌కి అదేపనిగా రాయటం అంటే చికాకు. అంతేకాక, అదేపనిగా చదవమన్నా ఇబ్బంది పడతారు. కాబట్టి కోర్సు పూర్తి చేయడానికి మీరు ఎంచుకున్న విధానమే బెస్ట్. అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా మరింత ప్రయోజనాన్ని పొందగల్గుతారు. ఫ్రెండ్స్‌తో కలిసి చదవటం అనే వంకతో చాలామంది పిల్లలు కబుర్లకు, ఆటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. దీని వల్ల మీ తల్లిదండ్రులు ఇటువంటి పద్ధతిని వ్యతిరేకిస్తారు. అయితే మీ విషయంలో వినటం ద్వారా మంచి ప్రయోజనం కల్గుతోంది. ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు విడమరిచి చెప్పండి. అలాగే, మీ స్నేహితుని ద్వారా పాఠాంశాన్ని తిరిగి వినేటప్పుడు మీరు మరింత శ్రద్ధగా ఆలకించడానికి ప్రయత్నించండి. మీ స్నేహితుణ్ని విషయాన్ని స్పష్టంగా, వివరంగా చెప్పమనండి. అతను చెప్పే సమయంలో విజ్యువల్‌కు ఇంపార్టెన్స్ లేదుకాబట్టి మీరు కళ్ళు మూసుకుని వినండి. దీనివల్ల మంచి ఫలితం వుంటుంది.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమ్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నోకమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, ఫ్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

అంతరిక్షం-అభివృద్ధి

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం అనేది రెండువైపులా పదునున్న కత్తి లాంటిది. కత్తితో కూరగాయలూ కోయవచ్చు, కుత్తుకలూ కోయవచ్చు. మానవాళి చేతిలో శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం కూడా అంతే. పెరిగే విజ్ఞాన శాస్త్రాన్ని మానవాళి ఉమ్మడి ప్రయోజనాలకోసమూ ఉపయోగించుకోవచ్చు లేక కొందరి స్వార్థంకోసం దాన్ని అత్యధిక ప్రజలను హింసించేందుకూ ఉపయోగించవచ్చు. మానవజాతి చరిత్ర మొత్తాన్ని పరిశీలిస్తే శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని పశ్చిమదేశాలు దుర్వినియోగం చేసినంతగా మరే దేశాలూ చేయలేదు. పారిశ్రామిక విప్లవంతో వచ్చిన శాస్త్ర-సాంకేతికాభివృద్ధిని పశ్చిమదేశాలు ఇతర దేశాల ప్రజలను లోబరుచుకుని దోపిడీ చేయడానికి ఉపయోగించుకున్నాయి. నేలమీద, నీళ్లమీద, ఆకాశంలోనూ ప్రయాణ సదుపాయాలు పెంచడానికి ఉపయోగించాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవి ఇతర దేశాలపై యుద్ధాలు చేయడానికి ఉపయోగించుకున్నాయి. 20వ శతాబ్దంలో అణు, అంతరిక్ష పరిజ్ఞానంపై అమెరికాకు వచ్చిన పట్టును అది ప్రపంచాధిపత్యం సాధించడానికి ఉపయోగించుకుంటోంది. అణుపరిజ్ఞానాన్ని అమెరికా మొదట విద్యుత్తుకోసం కాకుండా విధ్వంసంకోసం ఉపయోగించుకుంది. ప్రపంచంలో అణుబాంబులతో మానవులను అంతమొందించిన ఏకైక దేశం అమెరికాయే. 1947 ఆగష్టు 6,9 తేదీల్లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకీలపై అమెరికా వేసిన అణుబాంబులు వేలాదిమంది ప్రాణాలు తీశాయి. అంతరిక్ష పరిజ్ఞానాన్ని కూడా అది ఇతర దేశాల మీద అధిపత్యం కోసమే ఉపయోగించుకుంటోంది. కొసావో యుద్ధంలోగాని, ఇరాక్‌మీద యుద్ధంలోగాని, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలోగాని అమెరికా విజయానికి బాగా తోడ్పడింది అంతరిక్ష పరిజ్ఞానమే.

సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవాళి సమిష్టి ప్రయోజనాలకోసం ఉపయోగించేవి సోషలిస్టు దేశాలు మాత్రమే. గతంలో రష్యా తన అణు పరిజ్ఞానాన్ని, అంతరిక్ష పరిజ్ఞానాన్ని కూడా ప్రధానంగా ప్రజలందరి బాగుకోసం, శాంతియుత ప్రయోజనాలకోసం ఉపయోగించుకున్నది. పశ్చిమ దేశాలనుండి తనకు ప్రమాదం పొంచిఉన్నప్పుడు మాత్రం అది అంతరిక్ష, అణుపరిజ్ఞానాన్ని రక్షణకోసం ఉపయోగించుకున్నది. అందుకే అది అణు పరిజ్ఞానంలో అమెరికాకు ధీటుగా ఉన్నప్పటికీ కూడా ఏ దేశంమీదా అణుబాంబు ప్రయోగించలేదు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని కూడా శాంతి యుత ప్రయోజనాలకే ఉపయోగించుకుంది. తొలి స్పుత్నిక్‌ను అంతరిక్షంలోకి పంపింది నాటి సోవియట్ యూనియన్. తొలి మానవుని, తొలి మహిళను కూడా అదే అంతరిక్షంలోకి పంపింది. సోవియట్ పతనానంతరం ఆ సంప్రదాయాలను మిగిలి ఉన్న సోషలిస్టు దేశాలు కొనసాగిస్తున్నాయి. ముఖ్యంగా క్యూబా నిజమైన సోషలిస్టు స్ఫూర్తితో శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవజాతి సంక్షేమంకోసం ఉపయోగిస్తోంది. కాకపోతే కోటి జనాభాగల



అంతరిక్షంలో క్యాలీఫ్లవర్ పెరుగుదలను హైరిజల్యూషన్‌లో తీసిన చిత్రం

చిన్నదేశం, అమెరికా ఆర్థిక దిగ్బంధనం, బెదిరింపులు, కుట్రలతో నిత్యం వేధింపులకు గురవుతున్న క్యూబాలో డాక్టర్లు తమ దేశ ప్రజలకే కాకుండా ప్రపంచంలో ఎక్కడ ప్రజలు అపాయంలో ఉన్నారో అక్కడికల్లా వెళ్లి సహాయం చేస్తున్నారు. క్యూబా ఔషధాలు అనేక క్లిష్ట వ్యాధులను నయం చేస్తున్నాయి. వైద్యరంగంలో క్యూబా నేడు ప్రపంచానికే అదర్శంగా ఉంది.

శాస్త్ర-సాంకేతిక రంగంలో అప్రతిహతంగా పురోగమిస్తున్న చైనా కూడా ఇవాళ నాటి సోవియట్ యూనియన్ నెలకొల్పిన సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ముఖ్యంగా అంతరిక్ష రంగంలో చైనా సాధిస్తున్న విజయాలను చూస్తుంటే పురోగామి శక్తులకు ఎంతో ఆనందం కలుగుతుంది. దానర్థం చైనా అసలు సైనికరంగంలో శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం లేదని కాదు. నిజానికి పశ్చిమదేశాలు తమ సాంకేతక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలపై ఎక్కుపెట్టడానికి సిద్ధపడినప్పటినుండి చైనా కూడా సైనికరంగంలో సాంకేతికంగా అభివృద్ధి సాధించడంపై కేంద్రీకరించింది. చైనాలో నేడు అంతరిక్ష పరిశోధనల తీరుతెన్నులు పరిశీలిస్తే సోషలిస్టు వ్యవస్థ ఔన్నత్యం బోధపడుతుంది. ఇటీవలే చైనా తన తొలి వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపింది. తన స్వంత అంతరిక్ష కేంద్రాన్ని నెలకొల్పుకొని మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలు చేయాలని ఉబలాటపడుతోంది.

చైనా ఇటీవల ప్రయోగించిన 'విత్తనాల అభివృద్ధి ఉపగ్రహం' ఆ కృషిలో భాగమే. కేవలం విత్తనాలు మొలకెత్తించడం కోసమే చైనా ఒక ప్రత్యేక ఉపగ్రహాన్ని తయారుచేసి సెప్టెంబర్ 9న అంతరిక్షంలోకి పంపి విత్తనాలపై అనేక ప్రయోగాలు నిర్వహించింది. వాయువ్య చైనాలోని జియుక్యుయాన్ ప్రయోగ కేంద్రం నుండి నింగికెగసిన ఈ ఉపగ్రహం 15 రోజుల ప్రయోగాల తరువాత భూమి మీదకు తిరిగి వచ్చింది. షిజియాన్-8 అని పిలుస్తున్న ఈ ఉపగ్రహంలో రెండు భాగాలున్నాయి. ఒక భాగం భూస్థిర కక్ష్యలోకి వెళ్లింది. అదక్కడే శాశ్వతంగా ఉండిపోతుంది. రికవరబుల్ ఉపగ్రహం మాత్రం గత ఆదివారంనాడు భూమిమీదికి తిరిగొచ్చింది. ఈ ఉపగ్రహంతోబాటు చైనా శాస్త్రవేత్తలు అంతరిక్షంలో ప్రయోగాలు నిర్వహించిన 215 కిలోల విత్తనాలు కూడా భూమ్మీదికి తిరిగొచ్చాయి. ఈ విత్తనాలను అంతరిక్షంలో గురుత్వాకర్షణ రహిత, అల్ట్రా-వయొలెట్ సహిత వాతావరణంలో 'మ్యుటేషన్స్'కు గురిచేశారు. మ్యుటేషన్ అంటే విత్తనపు జన్యువుల్లో ఆకస్మిక మార్పులు తేవడమన్నమాట. జీవి లక్షణాలను జన్యువులు నిర్ణయిస్తాయి గనుక 'మ్యుటేషన్స్'కు గురైన విత్తనాల్లో అనేక కొత్త లక్షణాలు ఏర్పడతాయి. వీటిలో అధిక దిగుబడి ఇవ్వడం, నీటి ఎద్దడినీ, చీడపీడలనూ తట్టుకోవడం వంటి లక్షణాలు కూడా ఏర్పడతాయి. చైనా పంపిన షిజియాన్-8 ఉపగ్రహం అంతరిక్షంలో క్యాబేజీ విత్తనం మొలకెత్తడాన్నీ, వికసించడాన్నీ గంటగంటకూ హై రిజల్యూషన్ చిత్రాలు తీసి భూమికి పంపింది. ఇప్పుడు రికవరబుల్ ఉపగ్రహం తీసుకొచ్చిన 'మ్యుటేషన్స్‌కు గురైన' విత్తనాలను చైనా వ్యవసాయ మంత్రిత్వశాఖ దేశంలోని వివిధ పరిశోధనాశాలలకు పంపి అక్కడ అధికోత్పత్తి విత్తనాలు అభివృద్ధి చేస్తుంది. ఇప్పటివరకు చైనా తొమ్మిది ఉపగ్రహాల్లో విత్తనాలను అంతరిక్షానికి పంపి విత్తనాభివృద్ధి చేసింది. ఇలా అంతరిక్షంనుండి తిరిగొచ్చిన విత్తనాలను గత నాలుగేళ్లలో 5,67,000 హెక్టార్లలో ప్రయోగాత్మకంగా నాటి 50కోట్ల యువాన్ల (సుమారు 250 కోట్ల రూపాయల) విలువైన 3,40,000 టన్నుల తిండిగింజల్ని ఉత్పత్తి చేశారు. అంతరిక్ష విత్తనాలవల్ల ప్రజలకు ఇటువంటి లాభాలున్నాయని గుర్తించింది కనుకనే ఈసారి చైనా పూర్తిగా విత్తనాభివృద్ధికోసం ప్రత్యేక ఉపగ్రహాన్ని పంపించింది. చైనాకన్నా ముందు అమెరికా, రష్యాలకు మాత్రమే అంతరిక్షంలో విత్తనాలపై ప్రయోగాలు నిర్వహించే సామర్థ్యం ఉంది. రానున్నకాలంలో ఇటువంటి మరిన్ని ప్రయోగాలు చేసి అంరిక్షాన్ని మరింతగా ప్రజాశ్రేయస్సుకోసం ఉపయోగించుకోవాలని చైనా శాస్త్రవేత్తలు కృతనిశ్చయంతో ఉన్నారు.

★

కొత్త పుస్తకాలు

సినారే మరో కవితా సంతకం

అక్షరాల్తో పదాలను మాలకట్టి భావాన్ని పండించడం ఒక కళ. చేయి తిరిగిన రచయితలు ఆ కళా విన్యాసాన్ని సునాయాసంగా ప్రదర్శిస్తారు. నిలువెత్తు తెలుగు సంతకంగా కీర్తించబడ్డ సినారె కవిత్వం మానవతా వాద స్పర్శతో సాగుతుంది. తను ఇటీవల కొత్తగా వెలువరించిన కవితా సంపుటి 'కలిసి నడిచే కలం'. ఇది 2005-2006 సంవత్సరాల మధ్య కాలంలో రాసిన కవితల సమాహారం. ఈ కవితా సంపుటిలో తనకూ, కవిత్వ సృజనకూ ఉన్న సంబంధాన్ని కవిత్వీకరించిన కవితలు ప్రధానంగా ఉన్నాయి. అలాగే మనస్తత్వ విశ్లేషణ, తాత్విక పరమైన కవితలూ ఉన్నాయి. విస్తృత స్థాయి, సాహిత్య నేపథ్యం, జీవితానుభవం గల సినారె సహజంగానే తను గ్రహించిన అంశాలను మలిదశలో సమీక్షిస్తూ కవితలు రాశారు.

'రచన, శ్వాస/నాలో సమాంతరంగా సాగే క్రియలు/రాయడం ఆగితే/ఊపిరి ఆగిపోయినట్టే/ఎప్పటికప్పుడు నా కవితల్లోకి ఎక్కందే/నేనున్న సమాజానికి నిద్రపట్టదు'(సృజన యాత్ర) అంటున్న డా॥ సి. నారాయణ రెడ్డి తనకీ, కవిత్వానికీ ఉన్న ప్రాణపద సంబంధాన్ని వ్యక్తీకరించారు. కవితకు వస్తువు సమాజంలోంచి రావాల్సిందే. కవిత్వం రాయకపోతే తను నిద్రపోలేనని చెప్పక, సమాజానికే నిద్రపట్టదు అనడంలో కవి చమత్కారం తెలుస్తుంది.

ఈ కవితా సంపుటిలోని కవితల్లో మరొక కోణం తాత్విక భావన. ప్రతి మనిషికీ తాత్విక అంశాల పట్ల జిజ్ఞాస ఉండాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ "తాను అల్లుకున్న సాలెగూళ్ళలో తిరిగే/లఘుమతులు విస్తరిస్తేగాని/విశ్వజనీన దృక్పథాల వైశాల్యం తెలియదు"(ఉపేక్షిస్తే అంతే) అంటారు. ఆ భానసే మరింత క్రియాత్మకంగా వివరిస్తూ 'బతకడమంటే క్రిమిలా పాకుతూ పోవడం కాదు/గానుగెద్దులా తిరిగినచోటే/తిరుగుతూ వుండడం కాదు/ బతుకంటే విరామచిహ్నాలు లేకుండా ప్రవహించే/ ఒక మహావాక్యం'(జీవిస్తూనే వుంటాను) అంటారు. మరోచోట జీవితం గురించి వాఖ్యానిస్తూ "తొణకడంలో ఒక అందముంది/ మధుపాత్రయినా మనసైనా" (తొణికితేనే కదా!) అని విలాసంగా వ్యాఖానిస్తారు.

పాఠకుడిలో మంచి కవితానుభూతుల్ని పంచిపెట్టే కవితా సంపుటి ఇది.

కలిసి నడిచే కలం కవితా సంపుటి

రచన : డా॥ సి. నారాయణ రెడ్డి

పేజీలు: 114, వెల: రూ. 100/-

పుస్తకాలు దొరకు చోటు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్

- వీరప్రసాద్



గమనం - ఘర్షణ - గమ్యం

యం. రత్నమాల

వెల: 40/-, పేజీలు: 141

ప్రతులకు :

నవోదయ పబ్లిషింగ్ హౌస్

నవయుగ పబ్లిషింగ్ హౌస్,

దిశ పుస్తక కేంద్రం, సహచర బుక్‌షాప్

స్వీకారం

కల్పిత

బేతాళ కథలు

డా॥ గంగిశెట్టి శివకుమార్

వెల: 20/-, పేజీలు: 32

ప్రతులకు :

విశాలాంధ్ర బుక్‌హౌస్

అన్ని బ్రాంచిలు

రుచి

డ్రమ్‌స్టిక్స్ బూంది

కావలసిన పదార్థాలు

బూందీ	- పావుకిలో
మునగకాయలు	- 3 లేదా 4
లవంగాలు	- 2
దాల్చినచెక్క	- చిన్న ముక్క
దనియాలు	- రెండు చెంచాలు
పచ్చిమిర్చి	- ఐదారు
వెల్లుల్లి రేకులు	- నాలుగైదు
ఉల్లిపాయలు	-2
కర్వేపాకు రెబ్బలు	- 2
కారం	- ఒక చెంచాడు

తయారు చేసే పద్ధతి

మునగకాయల్ని శుభ్రంగా నీటిలో కడిగి రెండు కనుపుల సైజులో కోయాలి. పై చెక్కు తీయకూడదు. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి సన్నగా తరిగి పెట్టుకోవాలి. లవంగాలు, దనియాలు, దాల్చినచెక్కలను దోరగా వేయించి మెత్తగా పొడి చేసి పక్కన పెట్టుకోవాలి. బూందీని (శనగపిండితో ఉప్పూ కారం లేకుండా) నూనెలో దూసి ఉంచాలి. ఇప్పుడు ఒక బాణలిలో నూనె పోసి మునగకాయల్ని గోరంత పసుపూ చిటికెడు ఉప్పూ వేసి వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నూనెలో ఉల్లి తరుగు, పచ్చిమిర్చి వేసి నూనెలో దోరగా వేయించాలి. చిదిమిన వెల్లుల్లి కూడా కలపాలి. ఈ మిశ్రమానికి సరిపడినంత ఉప్పు వేసి, వేయించి పెట్టిన మునగ ముక్కల్ని కూడా కలిపి సన్న సెగమీద ఐదారు నిమిషాలు ఉడకనివ్వాలి. నీరు అసలు పోయకూడదు. ఓ రెండు నిమిషాల్లో కూరను స్టౌమీది నుండి దింపుతామనుకున్నప్పుడు బూందీ, కర్వేపాకూ, ఎండుకారం, దనియాల పొడి వేసి కూరను కదపాలి. గరిటె పెట్టి కలియ బెట్టకూడదు. అలాపెడితే బూందీ మొత్తం తునిగిపోతుంది.

\- శారద

కొబ్బరి పూర్ణాలు

కావలసిన పదార్థాలు

కొబ్బరి తురుము	- నాలుగు కప్పులు
పంచదార	- రెండు కప్పులు
మైదా పిండి	- రెండు కప్పులు
బియ్యప్పిండి	- అరకప్పు
నూనె	- సరిపడినంత
యాలకులపొడి	- అరస్పూన్

తయారు చేసే పద్ధతి

ఒక గిన్నెలో కొబ్బరి తురుము, పంచదార వేసి వేడి చేయాలి. ఇది కరిగి ఉడికి ముద్దలాగా అవుతుంది. బాగా దగ్గరగా అయ్యాక యాలకుల పొడి వేసి దించుకోవాలి. మైదా పిండి, బియ్యప్పిండి ఓ గిన్నెలోకి తీసుకొని నీరుపోసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. మూకుట్లో నూనె కాగనిచ్చి కలిపి ఉంచుకున్న మైదాపిండిలో కొంచెం కొంచెం కొబ్బరి ముద్దను ముంచి నూనెలో వేసి వేయించి తీయాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి.

\- జ్యోతి





కీర్తి కాంక్ష

పుప్పాల కృష్ణమూర్తి

మహీధర దేశ రాజు కీర్తివర్మకు కీర్తికాంక్ష ఎక్కువ. ప్రతి ఒక్కరూ తనను గౌరవించాలనుకునేవాడు. వినయవిధేయతలు ప్రదర్శించని వాళ్లను రాజద్రోహులుగా ముద్రవేసి, శిక్షించేవాడు. ప్రజలు తనను గౌరవించడం కోసం నగరంలోని ముఖ్య కూడళ్లలో నిలువెత్తు చిత్రపటాలు పెట్టించాడు. వచ్చిపోయే వాళ్లంతా విధిగా తన చిత్రానికి నమస్కరించాలని, అలా చేయని వాళ్లను శిక్షించాలని శాసనం చేశాడు. ప్రతి బొమ్మ దగ్గర ఓ భటుణ్ణి కాపలా పెట్టాడు. ఇది జనానికి ఇబ్బందిగా మారింది.

ఓ రోజు మారయ్య అనే పశువులకాపరి అడవిలో గేదెలు మేపుకొని వస్తున్నాడు. ఒంటి నిండా బురదతో వున్న గేదెలు రాజుగారి బొమ్మ దగ్గరకొచ్చి తోకలు విదిలించాయి. బురదంతా బొమ్మ మీద పడింది. అది చూసి కాపలాభటుడు కొండయ్య పశువులకాపరిని కేకలేశాడు. వెంటనే మారయ్య క్షమాపణలు కోరాడు.

మరెవ్వరూ చూడకముందే రాజు బొమ్మ మీద వున్న బురదను తుడిచేశాడు కొండయ్య. ఇంకేముంది... ఒకపక్కన రంగులన్నీ పోయాయి. కొండయ్య భయంతో ఒణికిపోయాడు. వెంటనే రంగులు తెచ్చి, చెరిగిపోయిన చోట సరిచేసి, 'హమ్మయ్య' అనుకున్నాడు.

ఓ రోజు ముగ్గురు వర్తకులు పొరుగురాజ్యం నుండి మహీధరానికి వచ్చారు. ముందు వెళ్తున్న జనాన్ని చూసి, కూడలిలోని రాజు బొమ్మకు నమస్కరించారు. తర్వాత రాజు చిత్రపటాన్ని పరిశీలనగా చూశారు. వంకర కాలు, తొంటి చెయ్యి, మిడిగుడ్లు... 'ఇదేంటి? ఈ రాజు ఇంత వికారంగా ఉన్నాడు!' అనుకుంటూ రాజసభకు వెళ్లారు. ఆశ్చర్యం. రాజుకే వంకా లేదు. చాలా అందంగా ఉన్నాడు. చిత్రం జ్ఞాపకమొచ్చి ముగ్గురూ ఒకేసారి నవ్వారు. ఉగ్రుడైన రాజు వాళ్ల నవ్వుకు కారణమడిగాడు.

"మన్నించండి ప్రభూ!" అంటూ తాము చూసింది చెప్పారు.

"నా రూపాన్నలా మార్చిందెవరు? వెంటనే ఆ చిత్రాన్ని, అక్కడి కాపలాభటుణ్ణి లాక్కురండి" అని ఆజ్ఞాపించాడు.

తెచ్చిన చిత్రాన్ని చూసి రాజు మండిపడ్డాడు. భటుడు కొండయ్యకు ఉరిశిక్ష విధించాడు. అది విని కొండయ్య లబోదిబోమంటూ జరిగింది చెప్పాడు. తన చిత్రపటం మీద బురద చల్లించిన మారయ్యను పిలిపించి, కొండయ్యకు విధించిన శిక్ష అతనికి వేశాడు.

మారయ్య తన తప్పేంలేదని, ఆ తప్పంతా గేదెలదేనన్నాడు.

వెంటనే పశువులను సభలో ప్రవేశపెట్టారు. వాటిని చూసిన రాజు కోపంతో, "నేను ఈ దేశానికంతటికీ రాజును. మీ యజమానులే నాకు వంగి వినయంగా నమస్కరిస్తే మీరు నా ముఖాన బురద కొడ్తారా? మీకు ఉరిశిక్ష విధిస్తున్నా...." అన్నాడు. గేదెలు ఉలకలేదు. పలకలేదు.

"చూశారా ప్రభూ... అవేమీ మాట్లాడలేదంటే తమ నేరాన్ని అంగీకరిస్తున్నట్లే కదా. ఉరి తీయించండి. ఇకముందు ఏ గేదా ఇలా చేయదు" అన్నాడు కొండయ్య తప్పకుంటూ.

"వెంటనే ఈ గేదెల్ని ఉరితీయండి" ఆజ్ఞాపించాడు రాజు.

భటులు గేదెల్ని వధ్య స్థలానికి తోలుకెళ్తుండగా రాజగురువు ఎదురయ్యారు. ఆయన విషయం తెలుసుకొని గేదెలతో రాజప్రాసాదానికి వచ్చాడు.

"రాజా! మీ తీర్పులు, ప్రవర్తన చూసి జనం నవ్వుకుంటున్నారు. గేదెలకు నోరు లేకపోవడంతో అవి ఎవరి మీదకూ నేరాన్ని నెట్టలేకపోయాయి. అయినా మాటలు రాని, జ్ఞానంలేని పశువులకు రాజెవరో భటుడెవరో తెలుసా? గౌరవమనేది ప్రజలు ఐచ్ఛికంగా ఇచ్చేదేకానీ, వారి నుండి బలవంతంగా తీసుకోకూడదు. అలా తీసుకుంటే నిజమైన గౌరవాన్ని పొందుతున్నట్లు కాదు. దయచేసి మీ విధానాన్ని మార్చుకోండి" అని హితవు పలికాడు.

రాజుకు అప్పుడు కళ్లు తెరుచుకున్నాయి. రాజ్యంలోని తన చిత్రపటాలను తీసివేయించాడు. ప్రజారంజకంగా పాలించి, మంచి రాజుగా పేరు తెచ్చుకున్నాడు.